RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 215 మేడ్చల్ మల్కాజ్‌గిరి 27 ఆగష్టు 2024 మంగళవారం పేజీలు : 4

## మహిళలపై నేరాలు.. క్షమించరాని పాపాలు

న్యూఢిల్లీ : మహిళలపై జరుగుతున్న నేరాలు క్షమించరాని పాపాలని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. దోషులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో యువ వైద్యు రాలిపై హత్యాచారం, ముంబై సమీపాన బద్లాపూర్‌లో నాలుగేళ్ల చిన్నారులపై లైంగిక వేధింపుల ఉదంతాల నేపథ్యంలో ఆదివారం మహారాష్ట్రలోని జల్గావ్‌లో జరిగిన 'లఖ్‌పతి దీదీ సమ్మేళన్'లో ఆయన మాట్లాడారు. అలాగే ఆకాశవాణిలో 'మన్ కీ బాత్' 113వ సంచికలోనూ ప్రసంగించారు. 'దేశంలో తల్లులు, అక్కచెల్లెళ్ల రక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలి. నా ఎర్రకోట ప్రసంగంలో కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించాను. మహిళలపై నేరాలు క్షమించరాని పాపాలని ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి రాష్ట్ర ప్రభుత్వానికి చెబుతున్నాను. దోషులెవరైనా వదిలిపెట్టవద్దు.' అని స్పష్టం చేశారు.




# టీపీసీసీ చీఫ్ ఎంపికలో కాంగ్రెస్ కొత్త ఎత్తుగడ..

## కుల గణనను పక్కనపెట్టేందుకేనా..!

హైదరాబాద్ : కాంగ్రెస్ పీసీసీ చీఫ్‌గా ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పేరు ఖరారైందంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడకపోయినా.. కాంగ్రెస్ వర్గాల్లో సైతం జోరుగా చర్చ జరుగుతోంది.

బీసీ సామాజిక వర్గం నుంచి పీసీసీ చీఫ్‌ను ఎంపిక చేయడం వెనుక కాంగ్రెస్ తీవ్ర కసరత్తు చేసినట్లు తెలుస్తోంది. భవిష్యత్తు రాజకీయ అవసరాల దృష్ట్యా కాంగ్రెస్ వెనుకబడిన వర్గాలకు చెందిన వ్యక్తిని ఈ పదవికి ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. పీసీసీ చీఫ్ పదవి కోసం చాలా మంది పోటీ పడినప్పటికీ ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల నుంచి ఒకరికి ఇవ్వాలని అధిష్టానం నిర్ణయించిందట.

తెలంగాణలో ఎక్కువమంది బీసీ సామాజిక వర్గం ఓటర్లు ఉండటంతో వాళ్లకే పీసీసీ చీఫ్ పదవి ఇచ్చేందుకు కాంగ్రెస్ హైకమాండ్ మొగ్గు చూపిందనే ప్రచారం నడుస్తోంది. బీసీ సామాజిక వర్గం నుంచి రెండు, మూడు పేర్లు వినిపించినా విద్యార్థి నాయకుడిగా ఎన్‌ఎస్‌యూఐలో కీలకంగా పనిచేసి, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో సీనియర్‌గా ఉన్న మహేష్ కుమార్ గౌడ్‌ను అదృష్టం వరించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ హైకమాండ్ బీసీ నేత వైపు మొగ్గుచూపడం వెనుక అనేక కారణాలు ఉన్నాయనే చర్చ సాగుతోంది.

**కులగణన నేపథ్యంలో..** ప్రస్తుతం తెలంగాణలో కులగణనకు సంబంధించిన అంశపై ఎక్కువుగా చర్చ జరుగుతోంది. కులగణన చేసి బీసీల రిజర్వేషన్లను పెంచిన తర్వాత మాత్రమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. కులగణన చేపడితే ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశం ఉండటంతో పాటు పార్టీలోనే కొంతమంది దీనిపై అయిష్టంగా ఉన్నారనే చర్చ ఉంది. అక్టోబర్‌లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచిస్తుంది. కులగణన నిర్వహించకుండా ఎన్నికలకు వెళ్తే బీసీల్లో తిరుగుబాటు వస్తుందనే ఆలోచనతోనే ఆ సామాజికవర్గానికి చెందిన నాయకుడిని పీసీసీ చీఫ్‌గా ఎంపిక చేసి ఉండవచ్చనే అభిప్రాయం కొందరి నుంచి వ్యక్తమవుతోంది. బీసీలకు పీసీసీ చీఫ్ పదవి ఇవ్వడం ద్వారా వెనుకబడిన వర్గాలపై కాంగ్రెస్ పార్టీ నిబద్ధత ఎలాంటిదో అర్థమవుతుందనే ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు.. త్వరలోనే కులగణన చేస్తామని పీసీసీ కొత్త చీఫ్‌తో ప్రకటన చేయించి ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తైతే ఆ తర్వాత ఎప్పుడు కులగణన చేసినా మళ్లీ ఐదేళ్ల తర్వాత జరిగే ఎన్నికల్లోనే రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉంటుంది. బీసీల్లో తిరుగుబాటు చేయకుండా ఉండే ఉద్దేశంతోనే బీసీ సామాజిక వర్గం నుంచి పీసీసీ చీఫ్‌ను ఎంపిక చేశారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

**రెడ్డి, బీసీ కాంబినేషన్..** సీఎంగా రేవంత్ రెడ్డి ఉన్నారు. దీంతో మరో రెడ్డి లేదా అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తిని పీసీసీ చీఫ్‌గా నియమిస్తే కాంగ్రెస్ పార్టీలోనే అంతర్గత విబేధాలు వచ్చే అవకాశం ఉందని గ్రహించిన హైకమాండ్ పీసీసీ చీఫ్ పదవి బీసీకి ఇచ్చేందుకు ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. సీఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత కొత్త పీసీసీ చీఫ్‌ను నియమిస్తారని ప్రచారం జరిగింది. సార్వత్రిక ఎన్నికలు ఉండటంతో.. అప్పటివరకు రేవంత్ రెడ్డిని కొనసాగించాలని అధిష్టానం నిర్ణయించింది. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు పూర్తికావడంతో కొత్త పీసీసీ చీఫ్‌ను నియమించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కొత్త చీఫ్ ఎంపికకోసం హైకమాండ్‌తో రేవంత రెడ్డి రెండు, మూడుసార్లు చర్చలు జరిపినా కొలిక్కి రాలేదు. ప్రస్తుతం మాత్రం పీసీపీ చీఫ్ ఎంపిక పూర్తైందని.. అధికారిక ప్రకటన మాత్రమే మిగిలి ఉందనే చర్చ జరుగుతోంది.

# సీఎం రేవంత్ జైలుకు వెళ్లే ప్రమాదం.. నారాయణ హాట్ కామెంట్స్

హైదరాబాద్, ఆగస్టు 26: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సీపీఐ నేత నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. బడా బాబుల ఒత్తిడితో సీఎం రేవంత్ రెడ్డి జైలుకు వెళ్ళే ప్రమాదముందంటూ వ్యాఖ్యలు చేశారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఆయన జన్మస్థలం జైళ్లను బాగుచేయాలన్నారు. హైడ్రాతో బడా బాబులు అయినా జైలుకు వెళ్ళాల్సి వస్తుందని... లేదా వాళ్ల ఒత్తిడితో రేవంత్ రెడ్డి అయినా జైలుకు వెళ్లే ప్రమాదముందని అన్నారు. రేవంత్ రెడ్డి పులి మీద సవారీ చేస్తున్నారని.. మధ్యలో ఆపేస్తే పులి తినేస్తుందని అన్నారు. అప్పులు ఎగ్గొట్టిన వాళ్ళలో ఒక్క విజయ్ మాల్యా తప్ప మిగితా అందరూ గుజరాత్ వాళ్లే అని అన్నారు. ప్రధాని మోదీ దయాదాక్షిణ్యాల వల్ల అదానీ పెరిగారన్నారు. ఆయన సొంతంగా ఎదగలేదన్నారు. సెబీ కూడా అదానీకి దాసోహం అయ్యిందన్నారు. కర్ణాటక సీఎం సిద్దరామయ్యను విచారణ చేయవచ్చని ఆ రాష్ట్ర గవర్నర్ చెప్పారన్నారు. గవర్నర్ కేంద్రానికి రాష్ట్రానికి మధ్య ఒక బ్రోకర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ మోడీని మార్చే ప్రయత్నం చేస్తోందన్నారు. ఎన్ కన్వెన్షన్ విషయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బుసకొట్టి ఊరుకున్నారన్నారు. హైడ్రా పనితీరు అభినందనీయమని కొనియాడారు. ఎన్ కన్వెన్షన్ విషయంలో నాగార్జున నుంచి డబ్బులు వసూలు చేసి.. చెరువు నిర్మాణం చేయాలన్నారు. నాగార్జున బఫర్ జోన్‌లో.. కాదు ఎఫ్‌టీఎల్‌లోనే



నిర్మాణం చేశారని తెలిపారు. ప్రభుత్వ ఆఫీస్‌లు కూడా కూల్చాలని ఎంఐఎం అంటోందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలపై సీఎం రేవంత్ రెడ్డి అఖిలపక్ష సమావేశం పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సేవలు అందిస్తున్నాయన్నారు. ప్రైవేటు నిర్మాణలును ప్రభుత్వ సంస్థలతో పోల్చడం తప్పు అని నారాయణ పేర్కొన్నారు.

**పెరుగుతున్న మద్దతు..** కాగా... హైడ్రాకు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. అటు పొలిటికల్‌గా.. ఇటు సామాన్యుల నుంచి మద్దతు పెద్ద ఎత్తున వస్తోంది. ముఖ్యంగా ఎన్ కన్వెన్షన్ కూల్చివేత హైడ్రాకు కావల్సినంత మద్దతును కూడగట్టింది. అన్ని వర్గాల ప్రజలు దీనిపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రాపై సొంత పార్టీలో ఇబ్బందులు వస్తాయని తొలుత సీఎం రేవంత్ రెడ్డి భావించారు. కానీ ఎమ్మెల్యేలంతా రేవంత్ నిర్ణయానికి మద్దతు పలుకుతున్నారు. హైడ్రా లాంటి వ్యవస్థను రాష్ట్రమంతటా విస్తారించాలని రేవంత్‌కి ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేస్తున్నారు. హైడ్రాపై అభినందనలు తెలుపుతూ రేవంత్‌కి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, విప్ అడ్లూరి లక్ష్మణ్‌లు లేఖ రాశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో హైడ్రా తరహా వ్యవస్థ కోసం సీఎం రేవంత్‌కి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లేఖ రాశారు. వేములవాడ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు ఎఫ్‌టీఎల్ పరిధిలో గెస్ట్ హౌజ్ కట్టాడని ఆది శ్రీనివాస్ లేఖలో పేర్కొన్నారు. హైడ్రాను తమ నియోజకవర్గంలో కూడా విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డికి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రిక్వెస్ట్ చేశారు. నకిరేకల్ నియోజకవర్గంలో కూడా ఆక్రమణకు గురైన భూములను కాపాడాలని వేముల వీరేశం లేఖ రాశారు. ఆలేరు నియోజకవర్గంలో ఆక్రమణకు గురైన భూములు, అక్రమ కట్టడాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని సీఎంకి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య లేఖ రాశారు. తమ నియోజకవర్గంలో హైడ్రా లాంటి వ్యవస్థను తీసుకు రావాలని మానుకొండూర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే కాలే యాదయ్య, తదితరులు రేవంత్‌కి లేఖ రాశారు.



## హైదరాబాద్ ఐఐటీ దేశానికే గర్వకారణం: మంత్రి శ్రీధర్‌బాబు

సంగారెడ్డి: కందిలోని ఐఐటీ హైదరాబాద్‌ను తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు సందర్శించారు. అక్కడి విద్యార్థులు రూపొందించిన డ్రైవర్ రహిత కారును పరిశీలించి.. అందులో ప్రయాణించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డ్రైవర్‌లెస్ కారు అద్భుతంగా ఉందని, దీన్ని రూపొందించిన హైదరాబాద్ ఐఐటీ దేశానికే గర్వకారణమని అన్నారు. ప్రయోగదశలో ఉన్న ఈ డ్రైవర్‌లెస్ సాంకేతికత త్వరలో ఆచరణలోకి రావాలని ఆకాంక్షించారు. ఏఐ సేవలను అన్ని రంగాల్లో వినియోగించుకుంటున్నట్లు చెప్పారు.




## చంద్రబాబు సరికొత్త వ్యూహం.. పూర్వ వైభవం వస్తుందా..!

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఏపీలో ఘన విజయం సాధించిన తెలుగుదేశం పార్టీ.. పక్క రాష్ట్రం తెలంగాణలో పూర్వ వైభవం కోసం ప్రయత్నిస్తోందా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత 2014లో ఏపీలో టీడీపీ అధికారంలోకి రావడంతో.. తెలంగాణలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాయి. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీకి బలమైన క్యాడర్ ఉండేది. పార్టీ అధినేత చంద్రబాబు 2014లో ఆంధ్రప్రదేశ్‌పై ఎక్కువ దృష్టి కేంద్రీకరించడంతో తెలంగాణలో క్యాడర్ పక్కపార్టీల్లోకి వెళ్లిపోయారు. ఎప్పటినుంచో పార్టీని అంటిపెట్టుకున్ని ఉన్న నాయకులు మినహా.. మిగతా నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వరుసగా తెలంగాణలో పదేళ్లపాటు బీఆర్‌ఎస్ అధికారంలో ఉండటంతో టీడీపీ బలపడితే తమకు ఇబ్బందులు ఉంటాయనే ఉద్దేశంతో కేసీఆర్ తెలుగుదేశం పార్టీని ఎదుగుదలను పరోక్షంగా అడ్డుకున్నారు. పదేళ్ల తరువాత పరిస్థితులు తారుమారయ్యాయి. ప్రస్తుతం బీఆర్‌ఎస్ తెలంగాణలో బలహీనపడుతోంది. ఈ క్రమంలో మళ్లీ పూర్వ వైభవం సాధించేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సరికొత్త వ్యూహంతో ముందుకెళ్తున్నారు.

**తెలంగాణపై ఫోకస్...** చంద్రబాబు నాయుడు తాజాగా తెలంగాణ పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. నెలలో రెండు సార్లు తెలంగాణ పరిస్థితిపై సమీక్షిస్తానని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులు సిద్ధం కావాలంటూ పిలుపునిచ్చారు. 2014 తర్వాత ఏపీపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించడంతో తెలంగాణపై అధినేత ఫోకస్ తగ్గించారు. ఇక 2019 తర్వాత ఏపీలో ప్రతిపక్షంలో ఉండటంతో అక్కడ పార్టీని బలోపేతం చేసుకుని 2024 ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా ముందుకెళ్లారు. దీంతో టీడీపీ కూటమి ఏపీలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. తెలంగాణలో కొంత బలహీనపడింది. గత అనుభవాల దృష్ట్యా తెలంగాణలో పార్టీని బలోపేతం చేయడంపై చంద్రబాబు దృష్టి కేంద్రీకరించినట్లు తెలుస్తోంది. త్వరలోనే ఓ అడహాక్ కమిటీని వేసి.. ఆ తర్వాత పూర్తిస్థాయి కమిటీని వేయాలని చంద్రబాబు నిర్ణయించారు. దీంతో తెలంగాణలో టీడీపీ మళ్లీ పూర్వ వైభవం సాధిస్తుందనే చర్చ జోరుగా సాగుతోంది.

# నిరుద్యోగులకు శుభవార్త

## త్వరలో మరో 35 వేల ఉద్యోగాల భర్తీ: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన 90 రోజుల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామన్నారు. మరో 35 వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేయబోతున్నట్లు చెప్పారు. యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులై.. మెయిన్స్ కోసం సన్నద్ధమవుతున్న తెలంగాణ అభ్యర్థులకు 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' పేరిట రూ.1 లక్ష ఆర్థిక సాయం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు రేవంత్‌రెడ్డి చెక్కులు అందజేశారు. ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన 135 మంది అభ్యర్థులకు ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి అత్యధికంగా సివిల్ సర్వెంట్లు రావాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. సివిల్స్ ఉత్తీర్ణులై రాష్ట్ర ప్రతిష్ఠను పెంచాలని ఆకాంక్షించారు. మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించి.. ఇంటర్వ్యూకి ఎంపికైన వారికి కూడా రూ.1 లక్ష ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. "చదువుకు తగిన నైపుణ్యాలు లేకపోవడంతో చాలా మంది ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో యంగ్ ఇండియా వర్సిటీ ద్వారా 2వేల మందికి శిక్షణ ఇస్తున్నాం. వచ్చే ఏడాది నుంచి 20 వేల మందికి శిక్షణ ఇస్తాం. అంతేకాకుండా యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తాం. 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లకు అత్యధికంగా పతకాలు వచ్చేలా కృషి చేస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో 25 నుంచి 30 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తాం. గత ప్రభుత్వం వర్సిటీలను నిర్వీర్యం చేసింది. 10, 15 రోజుల్లో అన్ని వర్సిటీలకు నూతన వైస్ ఛాన్సలర్లను నియమిస్తాం. వర్సిటీల్లోని అన్ని ఖాళీ పోస్టులను



భర్తీ చేస్తాం. కొందరు ఉద్దేశపూర్వకంగా నిరుద్యోగులను రెచ్చగొడుతున్నారు. తద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు." అని రేవంత్‌రెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకానికి ప్రభుత్వరంగ సంస్థ సింగరేణి కాలరీస్ నిధులు సమకూరుస్తోంది. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సింగరేణి సీఎండీ బలరాం పాల్గొన్నారు.

# సంపాదకీయం

## శాంతి దూత మోదీ

### ఉక్రెయిన్ యుద్ధానికి సంధి కుదిర్చితే నోబెల్ ప్రైజ్?

ప్రపంచమంతా యుద్ధాలతో మునిగిపోయిన దశలో శాంతి వచనాలు పలికితే ఆ ప్రయత్నాన్ని మెచ్చునివారు ఎవరుంటారు? మిగతా దేశాలన్నీ విఫలమైన చోటనే ఓ దేశాధినేత తనవంతు ప్రయత్నంతో శాంతి నెలకొల్పితే దానిని ఎవరు కాదంటారు..? ఇప్పుడిదే పని చేస్తున్నారు భారత ప్రధాని మోదీ. రెండున్నరేళ్లుగా జరుగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో మోదీ తప్ప ఇతర దేశాలకు చెందినవారు ఎవరూ శాంతి మాట ఎత్తలేకపోయారు. అందుకే.. మోదీ శాంతి దూతలా కనిపిస్తున్నారు.

**అందరూ దూరమే.. మోదీనే దగ్గర..** ఉక్రెయిన్.. అమెరికా సారథ్యంలోని నాటో కూటమిలో చేరే ప్రయత్నంతో రష్యా యుద్ధానికి దిగింది. దీంతో సహజంగానే నాటో కూటమిలోని దేశాలు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ తదితరాలు రష్యాకు వ్యతిరేకంగా ఉక్రెయిన్ కు సాయం చేయడం మొదలుపెట్టాయి. ఆయుధాలు, మందుగుండు సహా అనేక విధాలుగా సాయం చేస్తూ యుద్ధాన్ని పరోక్షంగా ఎగదోస్తున్నాయి. మధ్యలో తుర్కియే వంటి దేశాలు సంధి ప్రయత్నాలు మొదలుపెట్టినా అవి ముందుకుసాగలేదు. ఒక్క భారత్ మాత్రమే మొదటినుంచి శాంతి శాంతి అని ఉద్ఘోధిస్తోంది.

**చర్చలు, సంప్రదింపులే మార్గం...** రష్యాతో భారత్ బంధం దశాబ్దాలుగా పటిష్ఠమైనది. ఓ దశలో అమెరికా పాకిస్థాన్ కు సాయంగా భారత్ పై యుద్ధానికి వస్తే రష్యానే అడ్డుకుంది. అయితే, ఇప్పటి పరిస్థితులు మారాయి. ఇక ఉక్రెయిన్ తో మనకు అంత బలమైన సంబంధాలు లేకపోయినా.. భారతీయ విద్యార్థులు వేలాదిమంది అక్కడ చదువుతున్నారు. ఈ నేపథ్యంలోనే భారత్ మొదటినుంచి ఉక్రెయిన్-రష్యాలకు సర్దిచెబుతూనే ఉంది. సంప్రదింపులు, చర్చల ద్వారానే సంక్షోభాలకు పరిష్కారం అని సూచిస్తోంది. ఐక్యరాజ్య సమితిలోనూ ఈ సమస్యపై కీలకమైన ఓటింగ్ సందర్భంగా తన వైఖరిని స్పష్టంగా చెప్పింది.

**ఇరు దేశాల్లో పర్యటించింది మోదీనే..** ఉక్రెయిన్ -రష్యా యుద్ధం మొదలయ్యాక ఆ రెండు దేశాలను సందర్శించిన దేశాధినేత ఎవరైనా ఉన్నారా అంటే అది మోదీనే.. చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ సహా రష్యాకు దగ్గరగా ఉండే ఏ దేశాధినేత కూడా ఉక్రెయిన్ కు వెళ్లలేదు. మోదీ మాత్రం ఆ పనిచేశారు. ఇక తాజాగా ఉక్రెయిన్ పర్యటనలో మోదీ మరింత చొరవ చూపారు. రెండు దేశాల చర్చలకు తాను స్నేహితుడిగా సాయం చేస్తానని ప్రకటించారు. యుద్ధానికి తక్షణమే ముగింపు పలకాలని సూచించారు. గత ఏడాది, ఇటీవల కలిసిన సందర్భంలోనూ పుతిన్ కు యుద్ధం వద్దనే చెప్పారు. మధ్యవర్తిత్వం వహించేందుకూ సిద్ధంగా కనిపించారు. మరిప్పుడు ఉక్రెయిన్ తిరుగుబాటు తీవ్రంగా ఉన్న వేళ మోదీ సూచన ఎంత వరకు చెల్లుతుందో చూడాలి. ఒకవేళ ఈ రెండు దేశాల మధ్య ఆయన యుద్ధాన్ని ఇక్కడితో ఆపగలిగితే పెద్ద విజయం సాధించినట్లే. మద్దతుదారులు పొగుడుతున్నట్లుగా 'ప్రపంచ నాయకుడు' అనే మాటకు న్యాయం చేసినట్లే. అంతేకాదు.. ఏకంగా ప్రతిష్మాత్మక 'నోబెల్ శాంతి బహుమతి'కి ఎంపికైనా ఆశ్చర్యం లేదు. ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో మరొక్క ప్రాణమూ పోకుండా, పైసా ఆస్తి నష్టం లేకుండా అదే జరగాలని ఆశిద్దాం.

# శారీరక ధారుఢ్యం, మానసిక ఉల్లాసానికి క్రీడా పోటీలు కీలకం : ఏసీపీ రాములు

## వాలీబాల్ క్రీడా పోటీలను ప్రారంభించిన ఏసిపి రాములు





శామీర్ పేట, (గరుడ వార్త) : యువత చెడు మార్గాల వైపు ఆకర్షితుల అవ్వకుండా ఉండేందుకు, క్రీడా పోటీలు ఎంతగానో ఉపకరిస్తూ... వారిలో ఏకాగ్రతను పెంపొందిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు తోడ్పడతాయని పేట్ బషీరాబాద్ ఏసిపి రాములు అన్నారు. సోమవారం శామీర్ పేట మండలం మజీద్ పూర్ పరిధిలోని జైన్ హెరిటేజ్ పాఠశాలలో మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి ఆదేశానుసారం ఉమ్మడి శామీర్ పేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువకులకు వాలీబాల్ క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రాములు మాట్లాడుతూ క్రీడ పోటీలను ప్రజల్లోకి తీసుకెళ్ళటానికి, యువకుల మధ్య స్నేహపూర్వక, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం క్రీడలను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. యువత చెడు అలవాట్ల వైపు చూడకుండా క్రీడల వైపు దృష్టి సారించాలని సూచించారు. ఈ ఒక్కరోజు జరిగే వాలీబాల్ టోర్నమెంట్లో పోటీలలో 18 టీములు పాల్గొన్నాయని ఏసిపి తెలిపారు. శామీర్ పేట ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పోటీలలో పాల్గొనాలని సూచించారు. మాదకద్రవ్యాల వైపు యువకులు వెళ్లకుండా క్రీడలపై దృష్టి సారించాలని చెప్పారు. ఇందులో 18 టీములుగా ఏర్పడి క్రీడల్లో పాల్గొన్నారు. కాగా ఈ పోటీలలో శామీర్ పేట పోలీసులు ప్రథమ స్థానంలో నిలువగా ద్వితీయ స్థానంలో జగన్ కూడా యువకులు, తృతీయ స్థానంలో తూముకుంట మున్సిపల్ యువకులు గెలుపొందారు. గెలుపొందిన క్రీడాకారులకు ఏసిపి రాములు చేతుల మీదుగా మెమొంటో ను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట్ ఎస్ఐలు హారిక, మునీందర్, నాయక్, పోలీస్ సిబ్బంది, యువకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# ముగిసిన సర్వే.. ముమ్మరంగా పనులు!



కొడంగల్: రాష్ట్రంలో కొడంగల్‌ను నమూనా నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారు. అందులో భాగంగానే వివిధ అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ముందుగా విద్య, వైద్యం, రవాణా రంగాలపై అధికారులు దృష్టి సారించారు. ఎస్టీ గురుకులం ఉన్న చోటనే, మైనార్టీ, ఎస్సీ, బీసీ గురుకులాలను ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని కేటాయించారు. మైనార్టీ గురుకులానికి నిధులు మంజూరయ్యాయి. రోడ్ల మరమ్మతుకు, నిర్మాణానికి రూ.176 కోట్లు మంజూరు కావడంతో టెండర్లు పూర్తి చేశారు. కొన్నిచోట్ల భూమి పూజ చేశారు. ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలనే లక్ష్యంతో మెడికల్ హబ్‌కు శ్రీకారం చుడుతున్నారు. జిల్లా స్థాయి ఆసుపత్రిలో ఉండే అన్ని వసతులు కల్పించేందుకు కార్యాచరణ చేపట్టారు. కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతం 50 పడకలుండగా, 220కి పెంచనున్నారు. ఇందుకోసం రూ.27 కోట్లు కేటాయించారు.

ఒకే చోట వైద్య కళాశాలలు: మెడికల్, నర్సింగ్, వెటర్నరీ, ఫిజియోథెరపీ కళాశాలల నిర్మాణానికి కొడంగల్ మండలం అప్పాయిపల్లిలో 74 ఎకరాల అసైన్డ్ భూమిని పరిశీలించారు. ఇందులో 45 మంది రైతుల నుంచి 60 ఎకరాలను తీసుకోనున్నారు. వారితో అధికారులు చర్చలు జరిపారు. ఉద్యోగంతోపాటు, ప్రభుత్వ లెక్కల ప్రకారం ఎకరం భూమికి రూ.10 లక్షలు ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే కళాశాలల పక్కనే వెంచర్ ఏర్పాటు చేసి ఒక ప్లాటు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వనున్నారు. ఈ అంశాలను రైతులకు వివరించి ఒప్పించేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

స్థలాన్ని సేకరించేందుకు చర్యలు

మెడికల్ కళాశాలల స్థల సేకరణ, ఇతర పనులు వేగంగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అప్పాయిపల్లిలోని 60 ఎకరాలను పరిశీలించాం. రైతులతో చర్చలు జరుపుతున్నాం.

వెంకట్రెడ్డి, 'కడా' ప్రత్యేక అధికారి.

# వృక్ష రాజసం... హరిత శోభితం



వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలోని రెండు వైపులా ఉన్న బైపాస్ రోడ్లు పచ్చని చెట్లు, పూలతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. రహదారులకు ఇరువైపులా నీడనిచ్చే మొక్కలతోపాటు వివిధ రకాల పూల మొక్కలు నాటి పెంచారు. దీంతో ఇవి ఏపుగా పెరిగి హరిత శోభితం సంతరించుకుంది. ఆయా మార్గాల్లో వెళ్లేవారికి కనువిందు చేస్తున్నాయి.

వేములవాడ పట్టణం చుట్టూ దాదాపు రూ.150 కోట్లతో మొదటి, రెండో బైపాస్ రహదారులను నిర్మించారు. వాటికి ఇరువైపులా, డివైడర్ల మధ్య నీడనిచ్చే, వివిధ రకాల పూల మొక్కలను అయిదారేళ్ల కిందట అటవీశాఖ పెద్ద ఎత్తున నాటి పెంచింది. ఆ తరవాత వాటి సంరక్షణ బాధ్యతలను మున్సిపల్ అధికారులకు అప్పగించింది. ప్రస్తుతం ఆ మొక్కలన్నీ పెరిగి పెద్దవై పచ్చదనాన్ని పంచుతున్నాయి. రోడ్లకు రెండు వైపులా, డివైడర్లలో పెరిగినవి, ఇతర పూల చెట్లు హరిత శోభితంతో కనువిందు చేస్తుండగా, ప్రజలకు మంచి వాతావరణాన్ని, స్వచ్ఛమైన గాలిని అందిస్తున్నాయి. ఉదయం నడకకు వెళ్లేవారికి, ఆయా మార్గాల్లోని రహదారులపై వెళ్లే వాహనదారులకు పచ్చదనం, విరబూసిన పూలు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. డివైడర్ల మధ్య ఉన్న పూల మొక్కలు, ఇతర మొక్కలు ఎండాకాలంలో ఎండిపోకుండా వీటి సంరక్షణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఎప్పటికప్పుడు నీటినందించే విధంగా రూ.8 లక్షలతో డ్రిప్ ఏర్పాటు చేశారు. దీంతో రహదారుల వెంబడి డివైడర్లలోని మొక్కలు పచ్చగా కళకళలాడుతున్నాయి.

నిర్మాణ ప్రాంతాల్లో కనుమరుగు

పట్టణంలో మూలవాగు వంతెన నుంచి ఇరువైపులా ఉన్న రెండు బైపాస్ రహదారులు గతంలో అభివృద్ధికి నోచుకోక అస్తవ్యస్తంగా ఉండేవి. అలాంటి రహదారులు అభివృద్ధి చెంది పట్టణానికి కళను తీసుకువచ్చాయి. వీటి వెంబడి ఇరువైపులా పెరిగిన వివిధ రకాల చెట్లు ఈ రహదారులకు కొత్తందాలను తెచ్చి పెడుతుండగా, కొందరు వ్యక్తులు ఏపుగా పెరిగిన పచ్చని చెట్లను నరికివేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం ఒకటో, రెండో బైపాస్ రహదారుల వెంబడి పెద్ద ఎత్తున భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. వాటిని నిర్మిస్తున్న సందర్భంలో ఇంటి యజమానులు నిబంధనలకు విరుద్ధంగా గుట్టు చప్పుడు కాకుండా రాత్రికి రాత్రి చెట్లను తొలగిస్తున్నారు. అయినా మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పట్టణ ప్రజలు వాకింగ్ చేయడానికి ఎంతోగానో దోహదపడుతున్న ఆయా మార్గాల్లో చెట్లు నరికివేస్తున్న వారిపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకొని పచ్చదనాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు చేపడతాం

పట్టణంలో పచ్చదనం పెంపొందించేందుకు విరివిగా మొక్కల పెంపకానికి ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నాం. బైపాస్ రహదారుల వెంబడి ఇళ్ల నిర్మాణం చేస్తున్నవారు చెట్లను తొలగిస్తే గుర్తించి వారికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి.

– అన్వేష్, కమిషనర్, మున్సిపల్, వేములవాడ

# వైభవంగా శివాలయంలో పూజలు

శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రావణమాసం పురస్కరించుకొని శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రం శామీర్ పేట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి (శివాలయం) ఆలయంలో ప్రధానార్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి సోమవారం కృష్ణాష్టమి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం





పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక అభిషేకము, అర్చన చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, హారతి, తీర్థ ప్రసాద వితరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి మొక్కులు తీసుకున్నారు. అలాగే ఉమ్మడి శామీర్ పేట మండలం వివిధ గ్రామాలలోని ఆలయాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు.

# ఎత్తిపోసేలా.. ఎదురుచూపులు..!

నల్గొండ : సాగర్ ఎడమకాల్వ పరిధిలో నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఉన్న ఎత్తిపోతల పథకాల నిర్వహణ రైతులకు భారంగా మారడంతో.. ఎత్తిపోతల పథకాల నిర్వహణను ప్రభుత్వమే చేపడుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. గతంలో పదేళ్లు అధికారంలో ఉన్న భారాస ప్రభుత్వమూ ఇదే విధంగా హామీ ఇచ్చినా..అది నెరవేరకపోవడంతో ప్రస్తుత ప్రభుత్వంపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి జిల్లాకే చెందిన మంత్రి ఉత్తమ్ సాగునీటి శాఖ మంత్రిగా ఉండటంతో త్వరలోనే ఇది నెరవేరనుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఎడమకాల్వ పరిధిలో 42 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. వీటి కింద 80 వేల ఎకరాల ఆయకట్టును గతంలో స్థిరీకరించారు. పదేళ్ల క్రితం ఈ ఎత్తిపోతల పథకాలను ప్రపంచబ్యాంకు నిధులు, రూ.40 కోట్ల వ్యయంతో ఆధునికీకరించారు. గతంలో ఈ పథకాల నిర్వహణ, పర్యవేక్షణ అంతా నీటిపారుదల శాఖ అభివృద్ధి సంస్థ (ఐడీసీ), అనంతరం నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్పీ) అధికారులే చూసేవారు. తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో ఎత్తిపోతల నిర్వహణను క్రమంగా రైతులకు అప్పగించారు. మరమ్మతు లు చేసినా.. ప్రభుత్వ పరంగా సరైన పర్యవేక్షణ, నిర్వహణ లేకపోవడంతో వానాకాలం, యాసంగి సీజన్లలో కాల్వకు నీళ్లు వదిలినప్పుడు వాటిని చివరి ఆయకట్టు వరకూ చేరవేయలేక రైతుల పొలాలు ఎండిపోతున్నాయి. సగానికి పైగా పథకాలు మూతపడే దశకు చేరుకున్నాయి.మొత్తం 42లో ఏ ఎత్తిపోతల పథకమూ దాని పరిధిలో స్థిరీకరించిన ఆయకట్టుకు నీళ్లందించం లేదు. ఉదాహరణకు ఈ కాల్వపై అతిపెద్ద ఎత్తిపోతలను నడిగూడెం మండలం సిరిపురం వద్ద నిర్మించగా..దీని పరిధిలో ఏడు గ్రామాలకు సంబంధించి 6200 ఎకరాల ఆయకట్టు ఉంది. మొత్తం 8 మోటార్లతో దీనిని డిజైన్ చేయగా...ప్రస్తుతం రెండు దశల్లో కలిపి 4 మోటార్లే పనిచేస్తున్నాయి. రెండు మోటార్లు కాలిపోయి రెండేళ్లయినా ఇప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. విద్యుత్తు నియంత్రిక సమస్యతో పాటూ పంప్‌హౌస్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వీటన్నింటినీ పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి, కీలకమైన నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం చేపడితేనే ఎత్తిపోతల పథకాలు గాడిన పడనున్నాయి.

సాంకేతిక సహాయకుల నియామకం రెండు, మూడు ఎత్తిపోతలకు కలిపి ఒక సాంకేతిక సహాయకుడిని నియమిస్తామని మంత్రి ప్రకటించడంతో క్షేత్రస్థాయిలో మాత్రం ఒక ఎత్తిపోతలకు ఇద్దరు సహాయకులు తప్పనిసరిగా ఉంటేనే మోటార్ల నిర్వహణతో పాటూ నిర్ధరించిన ఆయకట్టుకు నీరందుతుందని రైతులు భావిస్తున్నారు. ప్రస్తుతం నిర్వహణ బాధ్యతలు చూస్తున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్నెస్పీ) పరిధిలోనూ తగినంత మంది సిబ్బంది లేరు.

ఒక ఏఈ స్థాయి అధికారి ఆరు నుంచి 8 లిఫ్టులను పర్యవేక్షిస్తుండగా...పని భారంతో చాలా వరకు క్షేత్రస్థాయిలో అవి అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చడం లేదు. ఈ పథకాల నిర్వహణలోనూ సాంకేతిక పరిజ్ఞానం రైతులకు కొరవడటంతో తరుచూ మోటార్లు కాలిపోవడం, వాటి మరమ్మతులు, ఇతరత్రా వాటిని రైతులు ఎకరానికి ఇంత అని వసూలు చేయడం జరుగుతోంది. రాష్ట్రంలోని ప్రాజెక్టులు, కాల్వలకు లష్కర్లను నియమిస్తారనే అవకాశాలున్నాయని అధికారులు భావిస్తున్నారు.

## మాకిక్కడ.. మీకింకోచోట

హైదరాబాద్ : మూసీ నది పరివాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టుకు రక్షణ భూముల సేకరణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం రక్షణ శాఖతో సంప్రదింపులు చేయనున్నారు. వాటికి బదులుగా వేరే ప్రాంతంలో అంతేక విలువైన భూములను కేటాయించే దుకు నిర్ణయించారు. మూడు మండలాల పరిధిలో 300 నుంచి 500 ఎకరాల రక్షణ శాఖ భూములున్నట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే నగరంలో మొత్తం 55 కి.మీ పొడవున మూసీకి అటూ ఇటూ 50 మీటర్ల మేరకు ఆక్రమణలు, నిర్మాణాలను గుర్తించి వాటికి మార్కింగ్ వేసే ప్రక్రియ వేగంగా సాగుతోంది.ప్రత్యేకత: ప్రత్యేక మాస్టర్‌ప్లాన్ తయారీకి తాజాగా మరోసారి నోటిఫికేషన్ జారీ చేశారు.



ప్రకాశనతో సరిపెట్టకుండా గుజరాత్‌లోని సబర్మతి, లండన్‌లోని థేమ్స్ మాదిరిగా సుందరీకరణ, బోటింగ్, ఫుడ్‌కోర్టులు, మాల్స్ వచ్చేలా రూపకల్పన చేయనున్నారు.

**ఇబ్బందుల్లేకుండా..:** భవిష్యత్తులో ఎఫ్‌టీఎల్‌కు ఎలాంటి ఆటంకం లేకుండా మూసీ పరిధిలో అభివృద్ధి చేయడం కీలకమని భావిస్తున్నారు. గండిపేట, రాజేంద్రనగర్, గోల్కొండ మండలాల్లో రక్షణశాఖకు వేలాది ఎకరాల భూములున్నాయి. మార్కెట్ ధరతో సమానంగా అంతే భూమిని రక్షణశాఖకు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## జారీ ఇష్టారాజ్యం.. పర్యవేక్షణ పూజ్యం

హైదరాబాద్ : నగరంలో నకిలీ ట్రేడ్ లైసెన్సులు కుప్పలుతెప్పలుగా పుట్టుకొస్తున్నాయి. ఆన్‌లైన్‌లో రూ.350 చెల్లిస్తే చాలు.. ఎలాంటి పత్రం లేకపోయినా ధ్రువీకరణపత్రం మంజూరవు తుంది. జీహెచ్‌ఎంసీ అమలు చేస్తోన్న 'ఇన్‌స్టాంట్ అప్రూవల్' విధానమే అందుకు కారణం.అనుభవమైన పట్టింపేది..?: గతంలో ఈ విధానం ఆస్తిపన్ను, జనన, మరణ ధ్రువీకరణపత్రాల జారీకి కూడా అందుబాటులో ఉండేది. స్వీయ మదింపు పేరుతో కేటుగాళ్లు 35వేల నకిలీ ఇంటి నెంబర్లను, 27వేల నకిలీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను సృష్టించారు. ఆయా పత్రాలను ఉపయోగించి అక్రమార్కులు అనేక మోసాలకు పాల్పడ్డారు. దీంతో అప్పట్లో ఆస్తిపన్ను, జనన, మరణ ధ్రువీకరణపత్రాల జారీలోని 'ఇన్‌స్టాంట్ అప్రూవల్ విధానాన్ని రద్దు చేశారు. ట్రేడ్ లైసెన్సుల జారీపై నిర్ణయం తీసుకోలేదు. దీంతో నాలుగేళ్ల నుంచి దాదాపు 50వేల ట్రేడ్ లైసెన్సులు పుట్టుకొచ్చి ఉంటాయని అంచనా.

**తెల్ల కాగితాలు అప్‌లోడ్ చేసి..**




మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ గురువారం రెండు నకిలీ ట్రేడ్ లైసెన్సులను సృష్టించాడు. ఆన్‌లైన్ దరఖాస్తులో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేరును చేర్చి, డ్రగ్స్ మార్ట్ వ్యాపారాన్ని తెరిచేందుకుగాను లైసెన్సు కావాలంటూ, తెల్ల కాగితాలు అప్‌లోడ్ చేసి లైసెన్సులు పొందారు. గతంలో మల్కాజిగిరి సర్కిల్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం భవనానికి మేయర్‌ని యజమానిగా పేర్కొంటూ నకిలీ ఇంటి నెంబరును సృష్టించారు.

**సగానికి పైగా నకిలీవే..**

కొత్తగా 2022లో 43,888 లైసెన్సులు, 2023లో 54,744, 2024(ఏప్రిల్ వరకు)లో 4,646 లైసెన్సులు జారీ కాగా.. వాటిలో సగానికిపైగా నకిలీవేననే ఆరోపణలు ఉన్నాయి. దుకాణ విస్తీర్ణాన్ని తక్కువగా చూపించి కొందరు లైసెన్సు పొందుతున్నారు. ఇలా జీహెచ్‌ఎంసీ గత నాలుగేళ్లలో రూ.50కోట్ల నష్టపోయినట్లు అంచనా.

## ఎంపాక్స్... ప్రత్యేక వార్డులు సిద్ధం

హైదరాబాద్ : ప్రపంచవ్యాప్తంగా ఎంపాక్స్ (మంకీపాక్స్) అలజడి రేకెత్తిస్తున్న నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. ఇప్పటికే గాంధీ, నల్లకుంట ఫీవర్ ఆసుపత్రులను సిద్ధం చేసింది. అక్కడ ప్రత్యేక వార్డులు నెలకొల్పింది. గాంధీలో 20 పడకలు కేటాయించారు. ఇందులో పురుషులకు, మహిళలకు పదేసి పడకలు కేటాయించినట్లు గాంధీ వైద్యులు పేర్కొన్నారు. ఫీవర్ ఆసుపత్రిలో ఆరు పడకలు అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదు కాకపోయినా అప్రమత్తంగా ఉ ండటం అవసరమని వైద్యులు చెబుతున్నారు.

వ్యాప్తి ఇలా.. ఎంపాక్స్ లక్షణాలు కనిపిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం కాంగో, నైజీరియా, కామెరూన్ దేశాల్లో కేసులు ఎక్కువగా ఉన్నాయి. ఆ దేశాల నుంచి వచ్చే వారు జాగ్రత్తలు తీసుకోవాలి.

ఐసోలేషన్‌లో ఉండటం.. లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రిలో చేరాలని సూచించారు.రక్తం, శరీర ద్రవాలు, చర్మ గాయాలు, శ్వాసకోశ స్రావాల ద్వారా ఇతరులకు సోకుతుంది.ఈ లక్షణాలు ఉంటే..

హఠాత్తుగా జ్వరం రావడం తలనొప్పిజి కండరాల నొప్పులు,వెన్నునొప్పిజి కాళ్లు, చేతులు, ముఖంపై దద్దుర్లు, దురద

చలి, తీవ్ర అలసట

# వ్యర్థాల్లో అర్థం.. పరమార్థం




హైదరాబాద్ : హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రారంభమైన 'ఎకో సస్టైన్ ఎక్స్‌పో'లో వేర్వేరు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రతినిధులు తమ ఆవిష్కరణలు, పేటెంట్ పొందిన నమూనాలను ప్రదర్శించారు. గృహ, వాణిజ్యపరంగా ప్రతిరోజూ ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలు, వ్యర్థజలాలను పునర్వినియోగించేలా రూపొందించిన ప్రోటోటైప్‌లను సందర్శకులకు వివరించారు. ఇందులో తక్కువ విస్తీర్ణంలో ఎక్కువగా ఉపయోగపడే 'ఫుడ్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్' (చగ్), 'డీసెంట్రలైజ్డ్ వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్' నమూనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

బయోగ్యాస్ తయారీ ఇలా.. కంపోస్ట్ పద్ధతికి భిన్నంగా 'అనెరోబిక్' పద్ధతిలో వ్యర్థాలను ఎరువులు, బయోగ్యాస్‌గా మారుస్తున్నారు. 50 కేజీల ఆహార వ్యర్థాలను వేస్తే 1 కేజీ ఎల్పీజీ గ్యాస్ పరిమాణంతో బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేయొచ్చని చెన్నైకి చెందిన ఎవిర్స్‌టెక్ సంస్థ ప్రతినిధి వి.భరత్ తెలిపారు. ఆహార వ్యర్థాలను 'అనెరోబిక్ డైజెషన్ పద్ధతిలో' తక్కువ సమయంలో ఎరువుగా మారుస్తుంది. ఇంట్లో రోజూ ఉత్పత్తి అయ్యే ఆహార వ్యర్థాలను ఫుడ్ క్రషర్‌లో వేయాలి. అనంతరం దానిని ఫుడ్ వేస్ట్ స్ట్రరీ కోసం కేటాయించిన డ్రమ్ములో వేయాలి. దానికి అనుసంధానించిన ఫుడ్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్‌కు అది పయనించి చగ్‌పై అమర్చిన రియాక్టర్‌లో బయోగ్యాస్, ఎరువులను తయారు చేస్తుంది. బయోగ్యాస్‌ను తక్కువ ఒత్తిడితో ఇంట్లో వినియోగించుకోవచ్చు. 'బ్లాక్‌గోల్డ్'గా పిలిచే ఎరువును ఇంట్లో గార్డెనింగ్‌కు వినియోగించొచ్చు లేదా విక్రయించొచ్చు. అపార్ట్‌మెంట్ సముదాయాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఆఫీసు క్యాంటీన్లలో వీటిని పెద్దఎత్తున వినియోగించొచ్చు.

3 కేఎల్‌డీ సామర్థ్యంతో ...

20 నుంచి 30 కుటుంబాలున్న అపార్ట్‌మెంట్లలో వ్యర్థ జలాల నిర్వహణ సరిగా ఉండటం లేదు. వీటికి పరిష్కారంగా కర్ణాటకకు చెందిన ఇన్నోవేటివ్ వాటర్ టెక్నాలజీస్ అంకుర సంస్థ 3 కేఎల్‌డీ సామర్థ్యంతో 'డీసెంట్రలైజ్డ్ వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్'ను రూపొందించింది. తక్కువ ఖర్చులో వ్యర్థ జలాల నిర్వహణ, పునర్వినియోగించేలా దీనిని రూపొందించింది. రోజూ ఉత్పత్తయ్యే వ్యర్థజలాలను బయోజోన్ ట్యాంక్‌కు అనుసంధానం చేస్తారు. ఏరియేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత శుద్ధి చేసిన జలాలు ట్యూబ్ సెట్లర్ యూనిట్ లోకి వెళ్తాయి. ఇక్కడ రెండోసారి శుద్ధి చేసి డోసింగ్ పంపుల ద్వారా క్లోరినేషన్ చేస్తారు. అనంతరం శాండ్ ఫిల్టర్ ద్వారా శుద్ధి చేసి పంపుతారు. ఈ నీటిని గార్డెనింగ్ తదితరాలకు వినియోగించొచ్చు. సెట్లింగ్ ట్యాంక్‌లో మిగిలిపోయిన వ్యర్థాలు స్లడ్జ్ ట్యాంక్‌లో ఉండిపోతాయి. వాటిని తీసేయొచ్చు.

# కిడ్నీ బాధితులకు భరోసా



కోరుట్ల: డయాలసిస్ కేంద్రాలు గతంలో కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, హైదరాబాద్ నగరాల్లో మాత్రమే అందుబా టులో ఉంటుండేవి. కిడ్నీ వ్యాధిగ్రస్థులు మూడు రోజులకొకసారి వెళ్లి రక్తం శుద్ధి చేయించుకోవడం తీవ్ర ఖర్చుతో కూడుకొని ఉండేది. ప్రైవేటు ఆసుపత్రిలో ఖర్చుతోపాటు రవాణా వ్యయం భారమయ్యేది. ఆర్థికంగా ఉన్నవాళ్లు మాత్రమే సక్రమంగా చికిత్స చేయించుకునే వారు. నిరుపేదలు తరచూ వెళ్లే వీలుకాకపోవడంతో ప్రాణాలు కోల్పోయేవారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా డయాలసిస్ కేంద్రాన్ని కోరుట్లలో ఏర్పాటు చేయడంతో కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, కథలాపూర్, మేడిపల్లి, ఇబ్రహీంపట్నం, కమ్మర్‌పల్లి మండలాలకు చెందిన రోగులు సద్వినియోగం చేసుకుంటున్నారు. 2016 నుంచి ప్రభుత్వం ఉచిత బస్‌పాస్‌తోపాటు నెలకు రూ.2016 ఆసరా పింఛన్ అందజేస్తోంది.కోరుట్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 2023 జనవరి 5న డయాలసిస్ కేంద్రాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం, డీసీడీసీ కిడ్నీ కేర్ సంయుక్తంగా సేవలు అందించాలని నిర్ణయించారు. ముందుగా 5 రక్తశుద్ధి యంత్రాలను సమకూర్చడంతో ఆసుపత్రి పైఅంతస్తులో ప్రత్యేక విభాగంలో కేంద్రం ఏర్పాటు చేసి ఫిబ్రవరి 5 నుంచి రోగులకు డయాలసిస్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇటీవల మరో 5 యంత్రాలను ప్రభుత్వం కేటాయించడంతో మొత్తం 10 యంత్రాల ద్వారా నిత్యం 30 మందికిపైగా రోగులకు రెండు విడతల్లో డయాలసిస్ చేస్తున్నారు.

100 మందికిపైగా చికిత్స

కోరుట్ల డయాలసిస్ కేంద్రంలో మొత్తం 100 మందికిపైగా కిడ్నీ బాధితులు నమోదు చేయించుకున్నారు. రోగులకు వైద్య సేవలందించేందుకు కేంద్రం మేనేజర్, 13 మంది టెక్నీషియన్లు ఉ న్నారు. వీరు ఉదయం 5.30 నుంచి రాత్రి 12 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారు. రోజుకు 30 మందికిపైగా రోగులకు డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. ఒక్కొక్కరికి 4 గంటల సమయం పడుతుంది. హైదరాబాద్ గాంధీ ఆసుపత్రి నుంచి నెఫ్రాలజీ వైద్యులు టెలీమెడిసిన్ ద్వారా ఎప్పటికప్పుడు రోగుల రిపోర్టు ఆధారంగా చికిత్స అందిస్తుంటారు. అత్యవసర సమయంలో ఆసుపత్రిలోని ఇతర వైద్యులు చికిత్స చేస్తుంటారు. ఇప్పటివరకు 10,000లకుపైగా షిఫ్టుల్లో రోగుల రక్తం శుద్ధి చేశారు. ప్రతి రోగికి కొత్త వైద్య పరికరాలను అమర్చి చికిత్స చేస్తుంటారు. ఇక్కడ చికిత్స పొందిన ఆరుగురు కిడ్నీ వ్యాధిగ్రస్థులు కిడ్నీ ట్రాన్స్‌ప్లానింగ్ చేయించుకున్నారు. మరో నలుగురు ట్రాన్స్‌ప్లానింగ్ చేయించుకునేందుకు సిద్ధంగా ఉన్నారు.

మాది ఇబ్రహీంపట్న మండలం డబ్బా గ్రామం. నేను హోటల్ నడుపుతుంటాను. ఆరేళ్ల కిందట నా కిడ్నీలు చెడిపోయాయి. అప్పటి నుంచి ఇతర పట్టణాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకునే వాడిని. కోరుట్లలో కేంద్రం ఏర్పాటు చేయడంతో అప్పటి నుంచి మూడు రోజులకు ఒకసారి వచ్చి డయాలసిస్ చేయించుకుంటున్నాను. సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నాను.

సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం అందుబాటులో ఉండటంతో నిత్యం కిడ్నీ రోగులు వచ్చి సేవలు పొందుతున్నారు. రోజుకు 30 మందికిపైగా రోగులకు డయాలసిస్ చేస్తున్నాం. 50 మంది వరకు వినియోగించుకునే వీలుంది. నిత్యం వైద్యుల పర్యవేక్షణలో టెక్నీషియన్లు రక్తం శుద్ధి చేస్తుంటారు. – సునీతారాణి, ఆసుపత్రి సూపరింటెండెంట్

# రుణ మాఫీకి తప్పని పాట్లు

పెద్దపల్లి : ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ రైతులను కలవరపెడుతోంది. సాంకేతిక తప్పిదాలు, ఇతర కారణాలతో అర్హులైన రైతులకు దూరం చేసినట్లయింది. రోజుల తరబడి బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ అన్నదాతలు ప్రదక్షిణలు చేస్తున్నారు. రోజు రోజుకూ ఫిర్యాదుల సంఖ్య పెరుగుతోంది. దీంతో అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ అమలు చేసేందుకు రైతు వేదికల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అర్హుల జాబితా రూపొందించేందుకు జిల్లా యంత్రా ంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదించనున్నారు.

అనేక కారణాలు 12 డిసెంబర్ 2018 నుంచి 9 డిసెంబర్ 2023 వరకు పొందిన పంటరుణాలకు రూ.2 లక్షల రుణం మాఫీ కానుంది ఒకే రేషన్‌కార్డులో కుటుంబ సభ్యులందరూ కలిపి రూ.2 లక్షలలోపు ఉన్న వారికి మాఫీకాలేదు.రేషన్‌కార్డు లేకపోవడంతో కుటుంబ సభ్యుల నిర్ధారణ కాలేదు.బ్యాంకుఖాతా, ఆధార్ నంబరు సరిపోలకపోవడం, వివరాలు సక్రమంగా నమోదుకాకపోవడం. బ్యాంక్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడం.

జిల్లాలో మరో 17 వేల మంది..

జిల్లాలో రుణమాఫీ కావాల్సిన వారు సుమారుగా మరో 17 వేల మంది ఉంటారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వీరందరి నుంచి రైతువేదికల్లో అర్జీలు స్వీకరిస్తున్నారు. రైతుల నుంచి తీసుకున్న దరఖాస్తులను ఏవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ఇప్పటి వరకు మొదటి విడతలో 29,724 మంది రైతులకు రూ.149.42 కోట్లు, రెండో విడతలో 13,401 మంది రైతులకు రూ. 124.40 కోట్లు, మూడో విడతలో రూ.8,268 మంది రైతులకు రూ.101.75 కోట్లు మొత్తం 51,393 మంది రైతులకు రూ. 375.58 కోట్లు మాఫీ అయింది. మరో 17



వేల మందికి రూ.242.85 కోట్లు మాఫీ కావాల్సి ఉంది.

రేషన్‌కార్డు లేదని ఎస్టీపీసీ కేంద్ర సహకార బ్యాంకులో గతేడాది ఆగస్టులో రూ. లక్ష పంట రుణం తీసుకున్నా. మూడు విడతల వరకు ఎదురుచూశా. అధికారులను అడిగితే రేషన్‌కార్డు లేకపోవడంతో రాలేద ని చెబుతున్నారు. అధికారులు స్పందించి రుణమాఫీ చేసి ఆదుకోవాలి.
–అర్జున్, రైతు, పాలకుర్తి

ముగ్గురిలో ఎవరికీ మాఫీకాలేదు

నా భార్య, తండ్రితో కలిసి ముగ్గురి పేరిట వేర్వేరు బ్యాంకుల్లో రూ.2.60 లక్షల రుణం ఉంది. ముందుగా భార్యకు మాఫీ అనిచెప్పారు. ఒక్కరికి కూడా మాఫీ కాలేదు. ముగ్గురి పేర్లు ఒకే రేషన్‌కార్డులో ఉండటంతో మాఫీ కాలేదని అధికారులు చెబుతున్నారు.
–తిరుపతి, అబ్బాపూర్, జూలపల్లి మండలం

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం

జిల్లాలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తాం. అర్హుల జాబితాను ప్రభుత్వానికి నివేదించను న్నాం. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయనున్నాం.
–ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

## 8 నెలలవుతుంది.. ఎత్తిపోసేదెన్నడో?

ధర్మపురి: పట్టణ సమీపంలో ఉన్న అక్కపల్లి రిజర్వాయర్ పనులు గత ఎనిమిది నెలలుగా నిలిచిపోయాయి. పనులు ప్రారంభించిన కొద్ది నెలలకే ఎన్నికల కోడ్ రావడం.. ఈలోగా మళ్లీ డిజైనింగు అనుమతులు రావాల్సి ఉండడంతో ఆగిపోయాయి. గోదావరి జలాలతో ధర్మపురికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ రిజర్వాయర్‌లోకి సాగు నీటిని ఎత్తిపోయడం ద్వారా 5,500ఎకరాల బీడు భూములు సస్యశ్యామలం చేసే లక్ష్యంతో గత ప్రభుత్వం ఈ పనులు ప్రారంభించింది. మిషన్ కాకతీయలో భాగంగా చెరువు అభివృద్ధి పనులకు రూ.3 కోట్లు కేటాయించగా.. ఇవన్నీ దాదాపుగా పూర్తయ్యాయి. ఆ తర్వాత గోదావరి ఎత్తిపోతల పథకానికి రూ.60.90 కోట్ల నిధులు విడుదలయ్యాయి. సుమారుగా గోదావరి నుంచి ఒక కిలోమీటరు దూరంలో భారీ మొత్తంలో నీటిని నిలువ చేసే లక్ష్యంతో పెద్ద బావిని తవ్వారు. అయితే డిజైనింగులో సాంకేతిక పరంగా అనుమతులు రావాల్సి ఉంది. దీంతో ఈ పనులన్నీ పెండింగులో ఉ ండిపోయాయి.

**అధికారులు అనుమతి ఇస్తేనే..** ఈ పథకం బావికి గోదావరి నుంచి అనుసంధానం చేయడం.. ఆ తర్వాత పైపులైను ఏర్పాటుచేసి, అక్కపల్లి చెరువులోకి ఒక సెకన్‌కు 50 క్యూసెక్కుల నీటిని పంపించేలా కాలువలను నిర్మించాల్సి ఉంది. ఇరిగేషన్ అధికారులు అనుమతి



ఇస్తేనే ప్రారంభమయ్యే అవకాశముం ది. చెరువులో ఎల్లప్పుడూ 0.15 టీఎంసీలు నీటిని నిలువ ఉంచేలా ఎస్సారెస్పీ అధికారులు స్థిరీకరించారు. ఈ పనులు పూర్తయితే ధర్మపురి పట్టణంతోపాటు పలు గ్రామాలకు తాగు, సాగు నీటి సమస్య తీరనుంది.

**ఏటా ఇబ్బందులే..**

అక్కపల్లి చెరువును రిజర్వాయర్‌గా మార్చినా.. నీటి సౌలభ్యం లేక సాగునీరు అందడం లేదు. దీంతో ధర్మపురితోపాటు, నర్సయ్యపల్లె, కోరండ్లపల్లె, బుద్దేశ్‌పల్లి, తుమ్మెనాల, నాగారం, కమలాపూర్, కొత్తకోరండ్లపల్లె ప్రాంత రైతులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు పడితే చెరువు నిండి.. కొద్ది రోజులకు మత్తడి ద్వారా నీరు ఖాళీ అవుతోంది. ఈ పల్లెల్లో రైతులు వ్యవసాయం మానివేసి ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారు. ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే పుష్కలంగా సాగు నీరందే అవకాశముందని విస్తున్నారు.

**పూర్తయిన పనులు ఇవే..**

గతేడాది అక్కపల్లి చెరువును అభివృద్ధికి గత ప్రభుత్వం రూ.3కోట్లు మంజూరు చేసింది. దీంతో చెరువు చుట్టూ పొడవునా నూతనంగా కట్టను ఆధునికీకరించారు. ఆయకట్టుకు నీరందించేలా కాలువలను రూపొందించారు. గత వేసవిలో చెరువులో నీరు నిలిచేలా పూడిక తీయించారు. మరికొన్ని పనులు పెండింగులో ఉన్నాయి. ఇవి కూడా పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

**ప్రతిపాదనలు పంపించాం** అక్కపల్లి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన రీడిజైనింగు ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. పనులు పూర్తయితే ధర్మపురి ప్రాంతంలోని బీడు భూములన్నీ సస్యశ్యామలం అవుతాయి. – సాజిద్, ఏఈ, ఎస్సారెస్పీ, ధర్మపురి

## బిల్లులు రావు.. పోషకాలు లేవు!

గోదావరిఖని : 'పిండి కొద్దీ రొట్టె' అన్నారు పెద్దలు.. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిస్థితి కూడా అలాగే తయారయింది.. బిల్లులు సకాలంలో రాకపోవడంతో నిర్వాహకులు ఆహారంలో పోషకాలను పక్కన పెడుతున్నారు.. గోరుచుట్టుపై రోకటి పోటులా నిత్యావసరాల ధరలు మండుతుండటంతో పలుచని చారు.. తక్కువ ధర కూరలతో సరిపుచ్చుతున్నారు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,500 మంది వరకు మధ్యాహ్న భోజన నిర్వాహకులున్నారు. ఒక్కొక్కరికి రూ.60 వేల నుంచి రూ.2 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 9, 10 తరగతులకు సంబంధించి గత విద్యా సంవత్సరం చివరి నెల బకాయిలు కూడా ఇంకా రావాల్సి ఉంది. దీంతో అప్పులు తెచ్చి.. అరువులకు సరకులు తీసుకుని భోజనం వండాల్సి వస్తోందని నిర్వాహకులు వాపోతున్నారు. మరోవైపు మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు ఎక్కువగానే ఉన్నాయి. మెనూ ప్రకారం భోజనం చేస్తే ఒక్కో విద్యార్థికి కనీసం రూ.15 ఖర్చవుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. తక్కువ విద్యార్థులు ఉ



న్న పాఠశాలల్లో కొంత వరకు ఖర్చు తక్కువగా ఉన్నా, విద్యార్థులు ఎక్కువ ఉన్న పాఠశాలల్లో ఆర్థిక భారమవుతోంది. దీంతో నిర్వాహకులు తక్కువ ధరలో వచ్చే ఆలుగడ్డ ఇతర కూరగాయలతో వంటలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉదయం విద్యార్థులకు రాగి జావ ఇవ్వాలని నిర్ణయించినా అందుకు సంబంధించి నిధులు రాకపోవడంతో నిర్వాహకులు తయారు చేయడం లేదు. దీంతో ఆ పోషకాహారమూ అందడం లేదు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు, వర్కర్లు తమకు నెలలుగా వేతనాలు, బిల్లులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల డీఈవోలు జనార్దన్‌రావు, మాధవి, జగన్‌మోహన్‌రెడ్డి, రమేశ్‌లు మాత్రం ఎప్పటికప్పుడు బిల్లులు తయారు చేసి ట్రెజరీకి పంపుతున్నామని చెప్పారు. జూన్ వరకు బిల్లులు విడుదలయ్యాయని జులైవి త్వరలో విడుదలవుతాయని చెప్పారు. కాగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు మాత్రం తమకు ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరైతేనే మెనూ అమలు చేయగలమని, అప్పులు చేసే పరిస్థితి రాదని పేర్కొంటున్నారు.







# తెలుగు రాష్ట్రాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

తెలుగు రాష్ట్రాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా హైదరాబాద్, ఏపీలోని నెల్లూరు, కడప, నంద్యాలలోని శ్రీకృష్ణాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుడిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

# సినర్జిన్ కంపెనీ ప్రమాద బాధితులకు పరిహారం అందజేత



అమరావతి, ఆగస్టు 26: అనకాపల్లి జిల్లా జవహర్ లాల్ నెహ్రూ ఫార్మా సిటీలోని సినర్జిన్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో చనిపోయిన వారికి పరిహారం ప్రభుత్వం పరిహారాన్ని అందజేసింది. ఈ ఘటనలో చనిపోయిన ముగ్గురు కార్మికులకు ఒక్కో కార్మికుడికి రూ.1 కోటి చొప్పున ప్రభుత్వం ద్వారా పరిహారం అందజేశారు. ఈనె 23వ తేదీ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నలుగురిలో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. నాటి ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ నేడు విజయనగరం జిల్లాకు చెందిన ఉద్యోగి ప్రాణాలు కోల్పోయాడు. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న మరో కార్మికుడి ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. పరిహారం అందజేత, ప్రస్తుతం బాధితుడికి అందుతున్న వైద్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కాగా.. పరవాడ ఫార్మాసిటీలోని సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రేడియంట్స్ సంస్థ, యూనిట్ -3 లో జరిగిన ప్రమాదంలో గాయపడి ఇండస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులలో ముగ్గురు కార్మికులు జార?ండ్ వాసులు కాగా, ఒకరు విజయనగరం జిల్లాకు చెందినవారిగా గుర్తించినట్లు జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తెలిపారు. వీరిలో జార?ండ్‌కు చెందిన రోయ అంగిరియా(22), లాల్ సింగ్ (21) ఇప్పటికే మృతిచెందగా, మృతుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున పరిహారం అందించినట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈరోజు (సోమవారం) విజయనగరం జిల్లా వాసి కె. సూర్యనారాయణ (35) ఇండస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కలెక్టర్ ప్రకటించారు. సూర్యనారాయణ కుటుంబ సభ్యులకు మంగళవారం కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెక్కును అందించినట్లు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ప్రకటన విడుదల చేశారు.

## సెప్టెంబర్ చివరి నాటికి టీడీఆర్ బాండ్ల అక్రమాలు తేలుస్తాం: మంత్రి నారాయణ



తిరుపతి: టీడీఆర్ బాండ్ల అక్రమాలపై విచారణకు కమిటీ వేశామని, సెప్టెంబర్ చివరి నాటికి టీడీఆర్ బాండ్ల అక్రమాలు తేలుస్తామని ఏపీ మంత్రి నారాయణ తెలిపారు. తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీడీఆర్ బాండ్లలో రూ.వేల కోట్లు పక్కదారి పట్టాయన్నారు. కమిటీ నివేదిక వచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. "వైకాపా పాలనలో అవినీతిని కొత్తపుంతలు తొక్కించారు. నగరపాలక సంస్థల్లో ఉద్యోగులను నియమించి వ్యక్తిగత అవసరాలకు వినియోగించారు. మున్సిపల్ శాఖలోని సమస్యలను 6 నెలల్లో పరిష్కరిస్తాం"అని నారాయణ తెలిపారు.

# 108 రకాల నైవేద్యాలతో ఇస్కాన్ టెంపుల్‌లో జన్మాష్టమి వేడుకలు..



విజయవాడ: దేశ వ్యాప్తంగా నేడు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ప్రతి సంవత్సరం శ్రావణ మాసం కృష్ణ పక్షంలోని ఎనిమిదవ తిథి నాడు రోహిణి నక్షత్రంలో శ్రీకృష్ణుడు దేవకీ మాత అష్టమ గర్భాన జన్మించాడు. కాబట్టి ఈ రోజున మనం శ్రీకృష్ణ జన్మాష్టమిని జరుపుకుంటూ ఉంటాం. ఈ వేడుకల కోసం ఆలయాలన్నీ అందంగా ముస్తాబయ్యాయి. విద్యుద్దీప కాంతుల నడుమ మెరుస్తున్నాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి అనగానే మనకు గుర్తొచ్చేవి కన్నయ్య జన్మించిన మధుర, బృందావనం. అయితే దక్షిణాదిలోనూ జన్మాష్టమి వేడుకలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. కర్ణాటకలోని ఉడిపిలో కన్నయ్య జన్మదిన వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ఇక ఇస్కాన్ టెంపుల్ ఎక్కడుంటే అక్కడ జన్మదిన వేడుకలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. విజయవాడలోని ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇస్కాన్ టెంపుల్‌లో కొలువైన రాధా కృష్ణులను దర్శించుకునేందుకు తండోపతండాలుగా భక్తులు తరలివస్తున్నారు. మూడు రోజుల పాటు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఇస్కాన్ టెంపుల్ నిర్వహించనుంది. ఆగస్టు 25 ,26, 27 తేదీలలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు. నిన్నటి నుంచే వివిధ కార్యక్రమాలో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. 108 రకాల నైవేద్యాలతో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నారు. రాధాకృష్ణులకి 2వేల కిలోలతో పుష్పాభిషేకం నిర్వహించారు. అలాగు ఇస్కాన్ దేవాలయంలో పంచామృతాలతో కలశ అభిషేకాలను సైతం కన్నయ్యకు నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయిలో కళాశాల విద్యార్థులతో ఉట్టి మహోత్సవ కాంపిటేషన్‌ను విజయవాడ ఇస్కాన్ టెంపుల్ నిర్వహించనుంది. రాధాకృష్ణ ఉట్టి మహోత్సవ కాంపిటీషన్‌లో గెలుపొందిన విజేతలకు ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని చేతుల మీదుగా ఇస్కాన్ యాజమాన్యం బహుమతులు అందించనుంది.

కృష్ణాష్టమి సందర్భంగా ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో సాయంత్రం ఉట్టి వేడుకలు జరిగాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా విజయవాడలో ఆలయాలలో రద్దీ నెలకొంది. ఇక జన్మాష్టమి రోజున ఉపవాసం ఉండటం వల్ల జీవితంలోని అన్ని కష్టాలు తొలగిపోతాయని భక్తులు నమ్ముతారు. అలాగే జన్మాష్టమి రోజున కొన్ని పరిహారం చేయడం వల్ల శ్రీకృష్ణుడు, లక్ష్మీదేవి అనుగ్రహం లభిస్తుందని విశ్వాసం. ఈ రోజు ఉపవాసంతో పాటు పరిహారాలు చేయడం వల్ల అన్ని సమస్యలు తొలగిపోతాయట.

# ఇండియా ప్రతిపక్ష కూటమి దుష్ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లింది

రాజమండ్రి: బీజేపీ తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్న విషయం తెలిసిందే. రాజమండ్రి బీజేపీ కార్యాలయంలో ఎంపీ పురందరేశ్వరి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్ర మం జరిగింది. ఈ కార్యక్రమానికి అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, సోము వీర్రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజమండ్రి బీజేపీ ఎంపీ పురం దరేశ్వరి మాట్లాడుతూ.. 2014లో నిర్వహించిన సభ్యత్వ నమోదు ఆన్ లైన్‌లో మొదటిసారిగా ప్రవేశపెట్టామన్నారు. భారతీయ జనతా పార్టీ సిద్ధాం తాలు, బీజేపీ దేశానికి సేవ చేసే అంశాలు, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా అప్పట్లో ప్రజల వద్దకు తీసుకెళ్లడం జరిగిందన్నారు. చైనాకు సంబంధించిన కమ్యూనిస్టు పార్టీ ప్రపంచంలోనే తొమ్మిది కోట్ల మంది సభ్యులతో అతిపెద్ద పార్టీగా అవతరించిందని పురందేశ్వరి పేర్కొన్నారు. 2014 లో భారతీయ జనతా పార్టీ 11 కోట్ల మంది కొత్త సభ్యులు నమోదు చేసి ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించిందని పురందేశ్వరి తెలిపారు. ఎలాంటి అవినీతి మరకలేకుండా ప్రజాహితంగా తమ పార్టీ పని చేస్తోందన్నారు. భారత దేశంలో ఈ రోజుకి సభ్యుల సంఖ్య 18 కోట్ల వరకూ ఉందని పురందేశ్వరి తెలిపారు. 1980 వ సంవత్సరంలో ఇద్దరు పార్లమెంట్ సభ్యులతో మొదలైన బీజేపీ ప్రస్థానం, నేడు 240 మందీ పార్లమెంట్ సభ్యులను గెలిపించుకునే స్థాయికి వెళ్లిందని పురందేశ్వరి పేర్కొన్నారు. ఇండియా ప్రతిపక్ష కూటమి దుష్ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిందని తెలిపారు. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి తీసుకొస్తే సంపూర్ణంగా రాజ్యాంగాన్ని రద్దు చేస్తారని దుష్ప్రచారం చేశారని పురందేశ్వరి పేర్కొన్నారు. చర్చిల్ని, మసీదుల్ని కూల్చేస్తారని రిజర్వేషన్లు తీసివేస్తారని కావాలని దుష్ప్రచారం చేశారన్నారు. అందువల్లనే ఎన్నికల్లో సీట్లు తగ్గాయన్నారు. భారతీయ జనతా పార్టీ రాజ్యాంగాన్ని మార్చే ప్రసక్తే లేదని పురందేశ్వరి స్పష్టం చేశారు. రాజ్యాంగానికి కట్టుబడి పని చేసే పార్టీ భారతీయ జనతా పార్టీ అని పేర్కొన్నారు.




# వైద్యురాలి హత్యాచార ఘటన.. పాలీగ్రాఫ్ పరీక్షలో నిందితుడు ఏం చెప్పాడంటే?

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటనలో ప్రధాన నిందితుడు సంజయ్‌రాయ్‌కి ఇటీవల పాలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహించారు. జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా ప్రస్తుతం అతడు కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ జైల్లో ఉండగా అక్కడే ఈ లై డిటెక్టర్ పరీక్ష చేపట్టారు. ఇందులో నిందితుడు ఏం చెప్పారన్న వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు. అయితే, పాలీగ్రాఫ్ పరీక్షలో నిందితుడు అసత్యం, పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. తాను వెళ్లేసరికే వైద్యురాలు చనిపోయిందని అతడు చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి.

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో ఆగస్టు 9న ఈ దారుణం వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ఆ మరుసటి రోజే సివిక్ వాలంటీర్ అయిన సంజయ్ రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ.. కోర్టు ఆదేశాలతో నిందితుడికి పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్ష సమయంలో సంజయ్ అనాలోచితంగా, ఆత్రుతగా ఉన్నట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. అధికారులు అడిగిన ప్రశ్నలకు అవాస్తవాలు, సరిపోలని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. దర్యాప్తు బృందం ఆధారాలు చూపించినప్పుడు.. ఆ సమయంలో తాను అక్కడ లేనని నిందితుడు చెప్పాడట. అంతేగాక, తాను సెమినార్ హాల్‌కు వెళ్లేసరికి వైద్యురాలు అప్పటికే చనిపోయి ఉందని, భయంతో తాను అక్కడి నుంచి పారిపోయానని సంజయ్ చెప్పినట్లు సదరు కథనాలు వెల్లడించాయి. మరోవైపు, నిందితుడికి పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించే సమయంలో అతడి తరఫు డిఫెన్స్ లాయర్ లేకపోవడం చర్చనీయాంశమైంది. దీనిపై న్యాయవాది స్పందిస్తూ.. పరీక్ష ఎక్కడ నిర్వహిస్తామన్నది అధికారులు తమకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని, ఇది మానవహక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని ఆరోపించారు. కాగా.. వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడింది తానేనంటూ అంతకుముందు కోల్‌కతా పోలీసుల ఎదుట నిందితుడు నేరం అంగీకరించినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇటీవల సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి చెందిన వైద్యబృందం నిందితుడి మానసిక తీరును విశ్లేషించింది. ఘటన సమయంలో ప్రతీ నిమిషం చోటుచేసుకున్న విషయాలను నిందితుడు గుక్కతిప్పకుండా మొత్తం ఎపిసోడ్‌ను వివరించాడని, అతడిలో పశ్చాత్తాపమే లేనట్లు కన్పించిందని కేసు దర్యాప్తులో పాల్గొన్న ఓ సీబీఐ అధికారి చెప్పినట్లు కథనాలు వెలువడ్డాయి. అయితే, ఆ తర్వాత అతడిని కోర్టులో హాజరుపర్చగా.. సంచలన ఆరోపణలు చేశాడు. తానే తప్పు చేయలేదని, కావాలనే తనను ఇందులో ఇరికించారని న్యాయస్థానంలో కన్నీళ్లు పెట్టుకున్నాడు.




# ఏపీ ప్రభుత్వంపై వైసీపీ ఎమ్మెల్సీ ఆసక్తికర వ్యాఖ్యలు

విశాఖపట్నం: ఏపీలో కూటమి ప్రభుత్వంపై వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణీ విమర్శల దాడి చేశారు. ఎసెన్షియా ప్రమాదంలో సహాయక చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆమె ఆరోపించారు. మదనపల్లిలో పేపర్లు తగలబడితే హెలికాప్టర్ పంపారని, ఉత్తరాంధ్ర ప్రజల ప్రాణాలు కోసం ఒక హెలికాప్టర్ పంపలేరా అని ఆమె అన్నారు.

పేపర్లకు ఉన్న విలువ కార్మికుల ప్రాణాలకు లేవా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌పై విమర్శల చేయడానికి హెూమ్ మినిస్టర్ అనిత అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, అనిత భాష చూసి ప్రజలు సిగ్గు పడుతున్నారని అన్నారు. "అనిత సంస్కారహీనంగా మాట్లాడుతున్నారు. నితా ఒక అసమర్థ హెూం మినిస్టర్. వైఎస్ జగన్‌పై విమర్శలు పక్కన పెట్టి ఫార్మా ప్రమాదాల నివారణపై దృష్టి పెడితే బాగుంటుంది. అనితకు సన్మాల మీద ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలు మీద లేదు. ఎల్జీ పాలిమర్ ప్రమాద సమయంలో వైఎస్ జగన్ పరామర్శకు రాలేదని పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు. అనిత అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు" అని వరుదు కళ్యాణి పేర్కొన్నారు. పరవాడ సెనర్జీస్ ఫార్మాలో జరిగిన ప్రమాదంలో మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లింపుపై ప్రభుత్వం రంగంలోకి దిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు హెూమంత్రి అనిత ఇవాళ (సోమవారం) రంగంలోకి దిగారు. ఎసెన్షియ ఫార్మాలో ప్రమాద మృతులకు ఏవిధంగా చెల్లించారో అదే మాదిరిగా పరవాడ సెనర్జీస్ మృతుల కుటుంబాలకు కూడా పరిహారం చెల్లించాలని యాజమాన్యంతో ఆమె చర్చించారు. దీంతో బాధిత కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం చెల్లింపునకు పరవాడ సెనర్జీస్ ఫార్మా అంగీకారం తెలిపింది. పరిహారానికి సంబంధించిన చెక్కులను ఆసుపత్రిలో మృతుల కుటుంబాలకు సెనర్జీస్ యాజమాన్యం అందజేసింది.

# ఫ్రీహెూల్డ్ భూముల రిజిస్ట్రేషన్ ఆపడం మంచిదే: బొప్పరాజు వెంకటేశ్వర్లు



విజయవాడ: ఫ్రీహెూల్డ్ భూముల రిజిస్ట్రేషన్ ఆపడం మంచిదేనని ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వ ఆదేశాల మేరకే అప్పట్లో నిర్ణయాలు తీసుకున్నామన్నారు. ఆ లావాదేవీల్లో అవినీతి జరిగితే చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో బొప్పరాజు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న రెవెన్యూ సదస్సుల విజయవంతానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఐఆర్‌సీ, 12వ పీఆర్సీ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు. "ఏ కార్యాలయంలోనూ పురాతన రికార్డులకు భద్రత లేదు. దీనికోసం రికార్డు అసిస్టెంట్ పోస్టులివ్వాలని కోరుతున్నాం. తహసీల్దార్ కార్యాలయాలకు వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయలేదు. మదనపల్లె దస్త్రాల దహనం కేసులో దోషులెవరో తేలలేదు. రెవెన్యూ ఉద్యోగులు భయభ్రాంతులకు గురవుతున్నారు. వారిపై తప్పుడు అభిప్రాయానికి రావొద్దు. సీఐడీ విచారణ పూర్తయ్యాక అప్పుడు ఓ నిర్ణయానికి వద్దాం" అని బొప్పరాజు వ్యాఖ్యానించారు.

# ప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలిసారిగా విశాఖకు లోకేష్.. పెద్ద ఎత్తున స్వాగత ఏర్పాట్లు



విశాఖ: ఐటీ, మానవ వనరుల శాఖా మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఈ నెల 28వ తేదీన విశాఖ నగరానికి వెళ్లనున్నారు. నాలుగు రోజుల పాటు లోకేష్ విశాఖలోనే పర్యటించనున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత లోకేష్ విశాఖను సందర్శించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. విజయవాడ నుంచి 28వ తేదీ సాయంత్రం బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన నేరుగా విశాఖలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి వచ్చి, పార్టీ ముఖ్యనేతలతో భేటీ అవుతారు. ఆ తరువాత అక్కడే బస్సులో బసచేస్తారు. ఈ నెల 29వతేదీ ఉదయం సీతంపేట రాజేంద్రనగర్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి అల్పాహారం తీసుకుంటారు. అక్కడినుంచి జిల్లా కోర్టుకు వెళ్లి సాక్షి పత్రికపై దాఖలుచేసిన పరువునష్టం దావా కేసులో వాయిదాకు హాజరవుతారు. మధ్యాహ్నం పార్టీ కార్యాలయానికి చేరుకుని ముఖ్యనేతలు, పార్టీ కేడర్‌ను కలుసుకుంటారు. రాత్రికి అక్కడే బసచేస్తారు. ఈ నెల 30వ తేదీ ఉదయం పాఠశాలల పనితీరుపై విద్యాశాఖాధికారులతో సమీక్షించిన అనంతరం నగరంలోని ఒకట్రెండు పాఠశాలలను తనిఖీచేస్తారు. మధ్యాహ్నం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహిస్తారు. తరువాత పార్టీ కార్యాలయానికి చేరుకుని రాత్రికి అక్కడే బసచేస్తారు. ఈనెల 31వ తేదీ ఉదయం తిరిగి విజయవాడ బయలుదేరి వెళతారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తొలిసారిగా మంత్రి లోకేశ్ నగరానికి వస్తున్న నేపథ్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఆదివారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు, నేతలు ఆళ్ల శ్రీనివాసరావు, రాజశేఖర్, వి.భరత్, బుగత సత్యనారాయణ సమావేశమై సన్నాహాలపై చర్చించారు. ఈ నెల 28న పార్టీ శ్రేణులు భారీగా ఎయిర్‌పోర్టుకు చేరుకుని లోకేశ్‌కు ఘన స్వాగతం పలకాలని నిర్ణయించారు. ఈ మేరకు అన్ని నియోజకవర్గాల నుంచి జనాన్ని సమీకరించాలని జిల్లా కీలక నేతలు.. కింది స్థాయి నేతలను ఆదేశించారు.

# ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు



అమరావతి : శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ కృష్ణ జన్మాష్టమిపర్వదినం సందర్భంగా ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు అని అన్నారు. ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. "ఆ శ్రీకృష్ణ భగవానుడు మీ కుటుంబాన్ని ఆనందంతో, ఆరోగ్యంతో, ఐశ్వర్యంతో ఆశీర్వదించాలని మనసారా కోరుకుంటున్నాను. గీతాసారంతో జీవితసారం చెప్పిన శ్రీకృష్ణ పరమాత్ముడిని స్మరించుకోవడం అంటే మన కర్తవ్యాన్ని మనం గుర్తుచేసుకుని ముందుకు సాగడమే. ఏ విషయంలో అయినా మనకు స్ఫూర్తినిచ్చే శ్రీ కృష్ణ తత్వాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే ప్రతి అంశంలో మనం విజయం సాధించవచ్చు. కృష్ణాష్టమి సందర్భంగా ఆ నీలమేఘశ్యాముని కృపా, కటాక్షం రాష్ట్రంపై సదా ఉండాలని కోరుకుంటున్నాను" అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. .

# కృతి శెట్టి.. ది సన్ షైన్ బ్యూటీ!

కన్నడ బ్యూటీ కృతి శెట్టి.. హీరోయిన్ గా ఎలాంటి క్రేజ్ దక్కించుకుందో అందరికీ తెలిసిందే. చదువుకుంటూనే మోడల్ గా రాణించిన అమ్మడు.. చిన్నప్పటి నుంచే మంచి అవకాశాలు అందుకోవడం స్టార్ట్ చేసింది. పెంటాక్, లైఫ్ బాయ్, డైరీ మిల్క్ సిల్క్ వంటి పలు యాడ్స్ చేసి మెప్పించింది కృతి. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ సూపర్ 30 మూవీలో స్టూడెంట్ పాత్రలో నటించి ఆకట్టుకుంది. ఆ తర్వాత ఉప్పెన మూవీకి హీరోయిన్ గా సెలెక్ట్ అయింది. లెక్కల మాస్టర్ సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు దర్శకత్వం వహించిన ఉప్పెన మూవీతో టాలీవుడ్ లోకి గ్రాండ్ ఎంట్రీ ఇవ్వడమే కాకుండా.. సూపర్ హిట్ అందుకుంది. ఆ సినిమాతోనే మెగా మేనల్లుడు వైష్ణవ్ తేజ్ హీరోగా తెరంగేట్రం ఇచ్చారు. బేబమ్మ పాత్రలో నటించి.. యూత్ కు ఫేవరెట్ హీరోయిన్ గా మారిపోయింది. ఆ తర్వాత తక్కువ గ్యాప్ లోనే నాని శ్యామ్ సింగరాయ్, నాగ చైతన్య బంగార్రాజు చిత్రాలతో హిట్స్ కొట్టేసింది కృతి శెట్టి. కానీ ఆ తర్వాత ఆమె తన వరుస సినిమాలతో మెప్పించలేకపోయింది. మాచర్ల నియోజకవర్గం, వారియర్, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి,



కస్టడీ చిత్రాలు అనుకున్న స్థాయిలో ఆడలేదు. రీసెంట్ గా వచ్చిన శర్వానంద్ మనమే మూవీ కూడా మిక్స్ డ్ టాక్ అందుకుంది. ప్రస్తుతం ఆమె చేతిలో తెలుగు సినిమాలు లేవు. కానీ తమిళ, మలయాళ ఇండస్ట్రీల్లో మాత్రం అమ్మడు అదరగొడుతోంది. అజయంటే రాందం మోషనమ్ సహ పలు సినిమాలు చేస్తోంది. సినిమాల సంగతి పక్కన పెడితే.. కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో సందడి చేస్తోంది కృతి శెట్టి. స్టైలిష్ ఔట్ ఫిట్స్ లో మెరుస్తూ.. ఆకట్టుకుంటోంది. ఫ్యాషన్ లవర్స్ కు తన డ్రెస్సెస్, గ్లామర్ తో మెప్పిస్తుంది. అదిరిపోయే అందాలతో వావ్ అనిపిస్తుంది. సన్నని నడుము, చిరునవ్వుతో అట్రాక్ట్ చేస్తుంది. సూపర్ స్కిన్ టోన్ తో కుందనపు బొమ్మలా కనిపిస్తుంది. ఎప్పటికప్పుడు ఆమె పిక్స్ నెట్టింట వైరల్ అవుతూనే ఉన్నాయి. తాజాగా లైట్ ఎల్లో కలర్ మినీ డ్రెస్ లో కనువిందు చేసింది అమ్మడు. వీపందాలను చూపిస్తూ కవ్విస్తోంది. సూర్యుని వెలుగులో తన గ్లోయింగ్ స్కిన్ తో మైమరపిస్తోంది. ఓర చూపులతో కుర్రాళ్లను మాయ చేస్తోంది. నడుము మడతలతో హీట్ పుట్టిస్తోంది. సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతున్న కృతి పిక్స్ కు నెటిజన్లు లైకుల వర్షం కురిపిస్తున్నారు. బేబమ్మ అదుర్స్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. బ్యూటిఫుల్ కృతి అంటూ పొగుడుతున్నారు.

# 'కల్కి' గెస్ట్ కి బాలీవుడ్ లో పెద్ద ఛాన్స్

సీతారామం సినిమాతో టాలీవుడ్ లో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. తక్కువ సమయంలోనే తెలుగు ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టిన ఈ అమ్మడు బ్యాక్ టు బ్యాక్ విజయాలను సొంతం చేసుకుంది. ఆ మధ్య విజయ్ దేవరకొండతో నటించిన ఫ్యామిలీ స్టార్ నిరాశ పరిచినా కూడా ఆఫర్లకు మాత్రం కొదవ లేదు. ఇటీవలే ఈ అమ్మడు ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన కల్కి సినిమాలో కీలక అతిథి పాత్రలో నటించడం ద్వారా మృణాల్ వార్తల్లో నిలిచిన విషయం తెల్సిందే. ఆ సినిమాలో కనిపించింది కొన్ని నిమిషాలు అయినా కూడా అందరి దృష్టిని మృణాల్ ఆకర్షించింది అనడంలో సందేహం లేదు. హీరోయిన్ గా మృణాల్ ప్రస్తుతం సౌత్ లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్న విషయం



తెల్సిందే. ఇదే సమయంలో మళ్లీ బాలీవుడ్ నుంచి కూడా ఈ అమ్మడు ఆఫర్లు దక్కించుకుంటుంది. గతంలో హిందీలో చాలా సినిమాలు చేసిన మృణాల్ కి ఒక్కటి కూడా సరైన సక్సెస్ దక్కలేదు. ఇప్పుడు బాలీవుడ్ యంగ్ అండ్ క్రేజీ హీరో వరుణ్ ధావన్ సినిమాలో నటించే అవకాశం దక్కింది. వరుణ్ ధావన్ తండ్రి డేవిడ్ ధావన్ ఈ సినిమాను ప్రతిష్టాత్మకంగా తీసుకుని రూపొందిస్తున్నాడు. ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా ఎంపిక అవ్వడంతో పాటు కొన్ని సన్నివేశాల చిత్రీకరణ కూడా పూర్తి అయ్యిందట. బాలీవుడ్ లో వరుణ్ ధావన్ సినిమాలో నటించే అవకాశం రావడం అనేది ఖచ్చితంగా పెద్ద అవకాశం. ఆ సినిమా హిట్ అయితే కచ్చితంగా మృణాల్ కి హిందీలో మరిన్ని సినిమాల్లో నటించే అవకాశాలు రావచ్చు. మరో వైపు తెలుగు మరియు తమిళంలో ఈ అమ్మడు సినిమాలు చేస్తూ బిజీగా ఉంది.




# ఆ విషయంలో ప్రభాస్‌ను తెగ పొగిడేస్తున్న మలయాళీ బ్యూటీ..




ఇప్పుడిప్పుడే తెలుగు సినీ ఇండస్ట్రీలో మంచి క్రేజ్ తెచ్చుకుంటున్న మలయాళం ముద్దుగుమ్మ మాళవిక మోహనన్. రజనీకాంత్ పేట, విజయ్ మాస్టర్ లాంటి సినిమాలలో గుర్తింపు తెచ్చుకున్న ఈ అమ్మడు విక్రమ్ నటించిన 'తంగలాన్'మూవీతో ప్రేక్షకులను బాగా మెప్పించింది. ఇక త్వరలో ప్రభాస్ రాజా సాబ్ చిత్రంతో టాలీవుడ్‌లో అడుగు పెట్టబోతోంది. ఈ నేపథ్యంలో ఈ బ్యూటీ ప్రభాస్‌కి సంబంధించి చేసిన కొన్ని వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. అనుష్క దగ్గర నుంచి శ్రద్ధ కపూర్ వరకు.. ప్రభాస్‌తో నటించిన ఏ హీరోయిన్ అయినా బాగా పాపులర్ అయ్యారు. అలాగే తన లక్‌ని ట్రై చేసుకోవడానికి రాజా సాబ్ చిత్రంతో వస్తున్న మరొక బ్యూటీ మాళవిక మోహన్. కల్కి మూవీ సక్సెస్ తరువాత ప్రభాస్ నటిస్తున్న చిత్రాలపై టాలీవుడ్ తో పాటు వరల్డ్ మార్కెట్లో అంచనాలు పెరిగాయి. దీంతో ప్రభాస్ పక్కన ఆఫర్ వచ్చిన ఏ హీరోయిన్ అయినా లక్కీ అన్న మాట ఇండస్ట్రీలో బలంగా వినిపిస్తోంది. మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న హారర్ కామెడీ థ్రిల్లర్ మూవీ 'ది రాజా సాబ్' లో మునుపెన్నడూ చూడని విధంగా ప్రభాస్‌ని చూడబోతున్నాం. ఇప్పటికే చిత్రం నుంచి విడుదలైన వింటేజ్ ప్రభాస్ లుక్స్ సోషల్ మీడియాలో వైల్డ్ ఫైర్ లాగా స్ప్రెడ్ అయ్యాయి. 'తంగలాన్'ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కూడా ప్రభాస్ గురించి మాట్లాడిన మాళవిక.. ప్రభాస్ తన అమ్మలాగ భోజనం అద్భుతంగా పంపించాడు అని తెగ పొగిడేసింది. మాళవిక మాత్రమే కాదు ప్రభాస్‌తో పని చేసిన ఏ సెలబ్రిటీ అయినా అతను పెట్టే భోజనం, చూపించే ఆదరణ గురించి మాట్లాడకుండా ఉండరు. అయితే ఇప్పుడు మాళవిక చెప్పిన మాటలు ప్రభాస్ అభిమానులను మరింత ఖుష్ చేస్తున్నాయి. తాజాగా 'తంగలాన్'మూవీ పూర్తిచేసుకుని 'ది రాజా సాబ్' చిత్రం షూటింగ్లో జాయిన్ అయిన మాళవిక..'కల్కి చిత్రం విడుదలకు ముందు కూడా నేను ప్రభాస్‌తో కలిసి పని చేశాను. అయితే కల్కి మూవీ సక్సెస్ తర్వాత అతనిలో ఎంతో కొంత మార్పు కనిపిస్తుందేమో అని అనుకున్నాను. కానీ అంత పెద్ద బ్లాక్ బస్టర్ హిట్ సాధించి కూడా ప్రభాస్‌లో ఎలాంటి మార్పు లేకపోవడం నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఆయన అప్పుడు ఎలా ఉన్నారో.. ఇప్పుడు అలాగే ఉన్నారు. అసలు ఇలా ఉండడం ఎవరి వల్ల కాదు.

కానీ ఆయనలో ఎనర్జీ మాత్రం ఏ మాత్రం తగ్గలేదు..'అని ప్రభాస్ నిరాడంబరత గురించి మరొకసారి చెప్పుకొచ్చింది ఈ బ్యూటీ. ఈ మూవీని హాట్ సమ్మర్ కూల్ ట్రీట్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# జాన్వీకపూర్ కేరింగ్ అంతా ప్రియుడిదేనా?



కల్తీ ఆహారం కారణంగా అస్వస్థకు గురై ఆసుపత్రిలో చేరిన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ డిశ్చార్జ్ అయింది. ఈ విషయాన్ని ఆమె తండ్రి బోనీ కపూర్ వెల్లడించారు. ప్రస్తుతం ఆమె సోదరి ఖుషీకపూర్– బాయ్‌ఫ్రెండ్ షిఖర్ పహారియా పర్యవేక్షణలో ఉన్నట్టు తెలిపారు. ప్రస్తుతానికి బాగా నీరసంగా ఉందని ఒక రోజు పూర్తిగా విశ్రాంతి తీసుకుంటే కోలుకుంటుందని అన్నారు. అలాగే పూర్తిగా కోలుకోవడానికి వారం రోజులు సమయం పడుతుం దని తెలుస్తోంది. అంతవరకూ జాన్వీ ఇల్లు కదిలే పరిస్థితి ఉండదు. దీంతో జాన్వీ బాధ్యతలన్నింటిని ప్రియుడు శిఖర్ పహారియా ఇప్పటి నుంచే తీసుకున్నట్లు కనిపిస్తుంది. కొన్ని నెలలుగా జాన్వీ–శికర్ పహారియా ఎంత క్లోజ్ గా మూవ్ అవుతున్నారో తెలిసిందే. కలిసి పార్టీలకు వెళ్లడం, గుడులుగోపురాలు చుట్టేయడం, అంబానీ ఇంట వివాహ వేడుకకు జంటగా హాజరవ్వడం ఒకటేంటి? పహారియా ఎప్పుడు చూసినా జాన్వీ వెంటనే కనిపిస్తున్నాడు. జాన్వీ కూడా అతడికి అంతే ప్రాధాన్యత ఇస్తుంది. ఇంట్లో ఫ్యామిలీ మెంబర్ అయిపోయాడని ఎప్పుడో చెప్పేసింది. ఎమెర్జెన్సీ కాల్ లిస్ట్ లో ముందుగా అతడి నెంబర్ ఉంటుందని చెప్పింది. అప్పుడే అర్దమైంది ఇద్దరు మధ్య లవ్ ట్రాక్ వాకింగ్ రన్నింగ్ చేస్తుంది. కాబట్టి జాన్వీ తాజా పరిస్థితుల్లో కంటికి రెప్పాలా కాపాడుకోవాల్సిన బాధ్యత పహారియాపై అంతే ఉంది. అక్క అంటే ఖుషీకపూర్కి అంతే ఇష్టం. ఇద్దరు అక్కా–చెల్లికంటే క్లోజ్ ఫ్రెండ్స్ గా ఉంటారు. పార్టీలు..పబ్ ల్లో ఎంజాయ్ చేయడంలో సిస్టర్స్ చాలా చలాకీగా ఉంటారు. ఇక జీన్వీ కపూర్ , ఎన్టీఆర్–కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న %–%దేవర%–% సినిమాలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. అలాగే, రామ్ చరణ్ తదుపరి సినిమాకు కూడా ఆమె హీరోయిన్ గా ఎంపికైంది.

# ప్రాజెక్ట్ మొదలయ్యే దాకా డౌట్లు తప్పవా..?

సినిమాలో తను తెసుకునే రెమ్యునరేషన్ కి పూర్తి స్థాయిలో న్యాయం చేసే హీరోయిన్స్ లో బుట్ట బొమ్మ పూజా హెగ్దే ఒకరు. అమ్మడు సినిమాలో ఉంది అంటే గ్లామర్ విషయంలో ఎలాంటి ఢోకా లేదని అనిపిస్తుంది. చేసేది ఎలాంటి పాత్ర అయినా పూజా బేబీ చేసే థై షో కుర్రాళ్లకు సూపర్ కిక్ ఇస్తుంది. తెలుగులో చేసిన ఫస్ట్ రెండు సినిమాలు పెద్దగా ఆడకపోయినా అల్లు అర్జున్ తో చేసిన దువ్వాడ జగన్నాథం తో అమ్మడు పాపులారిటీ సంపాదించింది. అప్పటి నుంచి రాధే శ్యాం వరకు వరుసగా స్టార్ సినిమాల్లో నటిస్తూ సత్తా చాటింది. ఐతే రాధే శ్యాం సూపర్ హిట్ అయితే ఏమో కానీ అది నిరాశ పరచడం అమ్మడి కెరీర్ మీద ఎఫెక్ట్ పడేసింది. అటు తమిళ్ లోనూ బీస్ట్ దెబ్బ కొట్టింది. అందుకే పూజాకి ఆఫర్లు కరువయ్యాయి. మహేష్ గుంటూరు కారం సినిమాలో మొదట హీరోయిన్ గా ఓకే అనుకున్నా ఎందుకో చివర్లో ఆమెను తీసి శ్రీలీలని పిక్ చేసుకున్నారు. ప్రస్తుతం తెలుగులో ఛాన్స్ వస్తే మళ్లీ తన టాలెంట్ చూపించాలని చూస్తుంది పూజా హెగ్దే. నాగ చైతన్యతో విరూపాక్ష డైరెక్టర్ కార్తీక్ దండు చేస్తున్న



సినిమాలో పూజా హెగ్దే నటిస్తుందని టాక్ ఉంది.

పూజాతో ఒక లైలా కోసం సినిమా చేసిన నాగ చైతన్య మళ్లీ ఇన్నాళ్లకు జత కడుతున్నాడు. ఐతే పూజాకి నిజంగానే ఆ సినిమా ఆఫర్ వచ్చిందా ఇది కూడా అన్ని సినిమాల్లానే ఒక గాలి వార్తా అన్నది తెలియాల్సి ఉంది. పూజా సినిమా న్యూస్ లు అన్నీ ఒకటి అంటే మరోటి జరుగుతుంది. అందుకే చైతన్య సినిమా మొదలయ్యే దాకా పూజాని కన్ఫర్మ్ అని చెప్పడం కష్టం. ఈసారి ఛాన్స్ వస్తే మాత్రం అటు యాక్టింగ్ తోనే కాదు గ్లామర్ షోలో కూడా పూజా బేబీ అదరగొట్టాలని చూస్తుంది. ఇక ఈమధ్యనే సూర్య 44వ సినిమాలో ఛాన్స్ అందుకుంది పూజా హెగ్దే. దీనితో పాటు హిందీలో కూడా ఒక సినిమా చేస్తుంది. తెలుగులో తిరిగి పూజా ఫాం లోకి వస్తే మాత్రం అమ్మడి ఫ్యాన్స్ కి పండగే అని చెప్పొచ్చు. బుట్ట బొమ్మ సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చినా తన ఫోటో షూట్స్ తో మాత్రం కావాల్సినంత ఎంటర్టైన్మెంట్ అందిస్తుంది. పూజా ఫోటో షూట్స్ ఆమె అభిమానులకు కన్నుల విందు కలిగిస్తుంది.

# మన వర్మను కాదని ఆదిత్యతో....!

బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ మొన్నటి వరకు మన టాలీవుడ్ దర్శకుడు ప్రశాంత్ వర్మతో సినిమా చేసేందుకు సిద్ధం అయ్యాడు. కానీ ప్రశాంత్ వర్మ స్క్రిప్ట్ విషయంలో రణవీర్ సింగ్ అసంతృప్తి వ్యక్తం చేయడంతో సినిమా మొత్తానికే ఆపేశారనే వార్తలు వస్తున్నాయి. దర్శకుడు ప్రశాంత్ వర్మ ఈ విషయాన్ని సన్నిహితుల వద్ద తెలియజేశాడట. ఇప్పటికే ప్రశాంత్ వర్మ తన కొత్త ప్రయత్నాలు షురూ చేశాడు. బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ ను హీరోగా పరిచయం చేసే బాధ్యత ను బాలయ్య చాలా నమ్మకంతో ప్రశాంత్ వర్మకు అప్పగించే అవకాశాలు ఉన్నాయి అంటూ వార్తలు వస్తున్నాయి. ఆ విషయమై త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ప్రశాంత్ వర్మ తో సినిమాలకు ప్రముఖ హీరోలు సిద్ధంగా ఉన్నారు. మరో వైపు రణవీర్ సింగ్ తదుపరి సినిమా కూడా దాదాపుగా కన్ఫర్మ్ అయ్యింది. ఇప్పటికే సింగం ఎగైన్ ను ముగించిన రణవీర్ సింగ్ ఇటీవల ప్రశాంత్



వర్మ మూవీ క్యాన్సిల్ అవ్వడంతో ఆదిత్య ధర్ దర్శకత్వంలో సినిమాకు ఓకే చెప్పాడట. ఇప్పటికే ఆదిత్య ధర్ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ ముగిసిందట. త్వరలోనే రణవీర్ సింగ్ షూటింగ్ లో జాయిన్ అవ్వబోతున్నాడని తెలుస్తోంది. జులై 25న సినిమా రెగ్యులర్ షూటింగ్ ను ప్రారంభించబోతున్నట్లుగా మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చింది. ఈ సినిమాలో రణవీర్ సింగ్ తో పాటు అర్జున్ రామ్ పాల్ మరియు సంజయ్ దత్ లు కీలక పాత్రలో నటించబోతున్నారు. థాయ్‌లాండ్ లో మొదటి షెడ్యూల్ ను ప్లాన్ చేస్తున్నారు. ఇండియన్ ఇంటిలిజెన్స్ ఏజెన్సీ కి సంబంధించిన కథ ను ఈ సినిమాలో చూపించబోతున్నారట. విదేశాల్లోనే ఎక్కువగా ఈ సినిమా షూటింగ్ ఉంటుందని తెలుస్తోంది. మరి మన ప్రశాంత్ వర్మ ను కాదన్న రణవీర్ సింగ్ ఎంతటి విజయాన్ని సొంతం చేసుకుంటాడో చూద్దాం అన్నట్లుగా తెలుగు ప్రేక్షకులు మరియు ప్రశాంత్ వర్మ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.

